తల్లి పాలే శిశువుకు తొలి టీకా



వివరాలు 2లో..

బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం , 02 ఆగస్టు-2026 balagamtv100@gmail.com పేజీలు-8

## ఉప్పల్ నల్ల చెరువుకు మహర్దశ



వివరాలు 2లో..

# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం



- అక్రమాల బట్టబయలుకు ఫాస్ట్‌ట్రాక్ విచారణ
- పేదల భూములు కాజేసిన వారిని వదిలిపెట్టం
- నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదు
- భూముల ధరల సవరణతో ఆదాయం 20శాతం వరకు పెరుగుదల
- త్వరలో అసైన్డ్ భూములపై సమగ్ర విధాన నిర్ణయం
- కేంద్రం నిధులు ఇవ్వకపోయినా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరాలు 2లో..

# తెలంగాణ రైజింగ్-2047'లో భాగస్వామ్యం అవ్వండి





- ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమష్టి కృషితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి
- సీఎస్ఆర్ ద్వారా కీలక పాత్ర పోషించాలని కార్పొరేట్ సంస్థలకు పిలుపు
- సదరన్ ఇండియా రీజనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్'లో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 01: కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) ద్వారా 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యసాధనలో భాగస్వామ్యం కావాలని కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమష్టిగా కృషి చేస్తేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ), హైదరాబాద్ ఛాప్టర్ ఆధ్వర్యంలో కొండాపూర్ లోని తెలంగాణ కాంట్రాక్టర్స్ కల్చరల్ క్లబ్ లో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న '50వ సదరన్ ఇండియా రీజినల్

# సోషల్ మీడియాతో పాత్ర మరువలేనిది

- సోషల్ మీడియాతో పాత్ర మరువలేనిది
- ఎన్నో వార్తలను వాటిదా-వారేనే వెలుగు చూస్తున్నాయి
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



హైదరాబాద్, జూలై 31 : యువతరం కొత్త తరహాలో దిల్లీలో కదం తొక్కిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ప్రధాని మోదీ ఎవరితో పెట్టుకో వద్దో వారితోనే పెట్టుకున్నారని చెప్పారు. వాట్సాప్ అంకుల్స్.. ఇన్‌స్టా పిల్లల్లో ఎవరు గెలిచారో చూశాం. అర్ధరాత్రి ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్టు చేశారు. సోషల్ మీడియా లేకపోతే జవాబుదారీతనం వచ్చేది కాదు. వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్‌జీలు ఓట్లు వేయబో తున్నారు. 18 నుంచి 24 ఏళ్ల మధ్య పిల్లలు పేపర్లు, టీవీలు చూడటం లేదు. నేటి యువత న్యూస్‌ను రీల్స్ రూపంలో చూస్తోందని కేటీఆర్ అన్నారు. మిగతా 3లో..



# డిజిటల్ బాటలో వ్యవసాయ మార్కెట్లు

- వ్యవసాయ మార్కెట్లలో పూర్తి డిజిటలీకరణ..
- మార్కెట్ కమిటీల ఆటోమేషన్‌కు ఆదేశాలు..
- కొనుగోళ్లు, లావాదేవీలన్నీ డిజిటల్ విధానంలోనే
- సౌర విద్యుత్ వ్యవస్థలు, పత్తి కొనుగోళ్ల
- కోహెడ పండ్ల మార్కెట్ పనులు వేగవంతం చేయాలి
- అధికారులకు మంత్రి తుమ్మల సూచనలు

హైదంఖశాఖలో కొనసాగుతున్న అన్ని ఇంజినీరింగ్ పనులకు స్పష్టమైన గడువులు నిర్ణయించి, ఈ ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరమైతే పనులను ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు అప్పగించి వేగవంతం చేయాలని సూచించారు. కోహెడ సమీకృత పండ్ల మార్కెట్ డిజైన్లను వచ్చే వారంలో ఖరారు చేసి, ముఖ్యమంత్రి అనుమతితో వచ్చే నెలలో నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మార్కెటింగ్ శాఖలో ఇంజినీరింగ్, పరిపాలన విభాగాల్లో ఉన్న సిబ్బంది కొరతను గుర్తించి అదనపు పోస్టుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని మార్కెటింగ్ డైరెక్టర్‌కు మంత్రి ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా అవసరమైన సిబ్బందిని నియమించాలని స్పష్టం చేశారు. సచివాలయంలో వరంగల్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్,



సూర్యాపేట, నల్గొండ, నిర్మల్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఆయిల్ పామ్ రైతు సంఘాల ప్రతినిధులు మిగతా 3లో..

# చెరువుల పునరుద్ధరణతో మారుతున్న రూపురేఖలు

## నల్ల చెరువు పునరుద్ధరణపై సిఎం రేవంత్ హర్షం



హైదరాబాద్, ఆగస్టు 01: చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మారుతున్న మన హైదరాబాద్‌ను చూడటం ఎంతో సంతృప్తినిచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నగరంలోని చెరువులకు జీవం పోస్తూ, భావి తరాలకు మెరుగైన భవిష్యత్తును అంకితం చేస్తున్న హైడ్రా పనితీరును ఆయన అభినందించారు. ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవానికి అహర్నిశలు శ్రమించిన హైడ్రా అధికారులకు, సిబ్బందికి సీఎం రేవంత్ రెడ్డి తన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదని, అది భావి తరాల భవిష్యత్తును భద్రపరచడమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రతి చెరువును కంటికి రెప్పలా కాపాడుకుంటూ.. ప్రతి అంగుళం ప్రజా ఆస్తిని సంరక్షిస్తూ తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని సీఎం చెప్పారు. నగరంలోని జలవనరుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

# స్వేచ్ఛ అంటే ఇష్టం వచ్చినట్లు చేయడం కాదు



- సమాజం, దేశం పట్ల బాధ్యతలు కూడా ముఖ్యమే
- చట్టాన్ని గౌరవించడం పౌరుల ప్రాథమిక విధి
- జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సంచలన వ్యాఖ్య
- దోవల్‌కు అమిత్ షా చేతుల మీదుగా తిలక్ జాతీయ పురస్కారం అందచేత 4లో..

# గోదావరి జలాలపై తెలంగాణకు నష్టం

- నీళ్లు మళ్లించే ఎపి కుట్రలు వేగమయ్యాయి
- కల్వకుంట్ల కవిత ఆరోపణ



హైదరాబాద్, ఆగస్టు 01: గోదావరి జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తోందని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆరోపిం చారు. రాష్ట్ర విభజన తర్వాత గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటాను అడ్డుకునేలా ఎత్తుగడలు వేస్తోందని విమర్శించారు. తమకు అనుకూలంగా వ్యవహరిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతుతో గోదావరి జలాలను మళ్లించే కుట్రలు వేగవంతమయ్యాయని ఆరోపించారు. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను ప్రశ్నిస్తూ ఫిర్యాదులు చేయ డం ద్వారా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బో ర్డు (జీఆర్ఎంబీ) కూడా ఆంధ్రప్రదేశ్ వైఖరికి అనుగుణంగా వ్యవహరిస్తోందని విమర్శిం చారు. గోదావరి నదిలో తెలంగాణకు 964 టీఎంసీల జలాలపై హక్కు మిగతా 3లో..

# పేపర్ లీకేజీ బిల్లుకు చట్టబద్ధత

## పార్లమెంట్ ఆమోదించిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం



న్యూఢిల్లీ, ఆగస్టు 01 : దేశంలో పేపర్ లీకేజీలను అరికట్టేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ అమెండ్‌మెంట్ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఆమోదించారు. దీంతో ఇకపై ఈ బిల్లు చట్టంగా అమలులోకి రానుంది. 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్, 2026' పేరుతో రూపొందిన ఈ బిల్లును ఈ వారంలోనే పార్లమెంట్ ఆమోదించింది. అటు లోక్‌సభలో చర్చ అనంతరం ఆమోదం పొందగా, మరుసటి రోజు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. దీంతో వెంటనే ఈ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వద్దకు పంపింది ప్రభుత్వం. ఇటీవల నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన గురించి తెలిసిందే. ఈ ఉద్యమం నేపథ్యంలో కేంద్రం పేపర్ లీకేజీలను అరికట్టేలా కొత్త బిల్లును తీసుకొచ్చింది. ఇదే అంశంలో 2024లో తెచ్చిన బిల్లుకు సవరణలు వివరాలు 3లో..

# ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం



- గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉత్తమ్ పర్యటన 2లో..
- పూడికతీత పనులను అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడి

# డీలిమిటేషన్‌తో తమిళనాడుకు మోసం

- ప్రజాస్వామిక హక్కులు దూరం చేసే యత్నం
- విపక్షనేత రాహుల్ వ్యాఖ్యలు



వివరాలు 3లో..

# ఒక్కరోజులో రెండు లక్షలు దాటిన మీసేవ లావాదేవీలు

- తొలిసారి రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు



- దేశంలోనే నెంబర్ వన్ గా మీసేవ ఆన్‌లైన్ ప్లాట్ ఫార్మ్
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

వివరాలు 2లో..

# భద్రాచలం వద్ద నిలకడగా గోదావరి

- 56 అడుగులకు చేరిన నీటిమట్టం
- భద్రాచలం చుట్టుపక్కల చేరిన వరదనీరు
- అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి తుమ్మల



వివరాలు 2లో..

# పెట్టుబడులు లక్ష్యంగా సిఎం విదేశీ టూర్

## ఆగస్ట్ 20 నుంచి పది రోజుల పాటు వివిధ దేశాల్లో పర్యటన



హైదరాబాద్,ఆగస్ట్1 : తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆగష్టు 20 నుంచి సెప్టెంబరు 8 వరకు దాదాపు 20 రోజులపాటు వివిధ దేశాల్లో సీఎం పర్యటించనున్నారు. అమెరికా, యూకే సహా మరికొన్ని కీలక దేశాలకు ఆయన వెళ్లనున్నట్టు సమాచారం. అయితే ఆయా దేశాల్లోని కంపెనీల ప్రతినిధులు, అపాయింట్‌మెంట్‌ల నేపథ్యంలో సీఎం టూర్ షెడ్యూల్ ఆగష్టు 20-23 తేదీల మధ్య ఉండవచ్చని కూడా అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ పర్యటనలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి సంస్థలు, ప్రవాస భారతీయులతో సీఎం సమావేశాలు నిర్వహించనున్నారు. ఐటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం టూర్ ఉండొచ్చని సమాచారం. అమెరికాలో చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ కంపెనీలతో, లండన్‌లో గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్వెస్టర్లు, విద్యా సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపే అవకాశం ఉంది. అలాగే గతంలో విదేశీ పర్యటనల సంద ర్భంగా పలు అంతర్జాతీయ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న నేపథ్యంలో.. ఆయా కంపెనీల ప్రతినిధులతోనూ రేవంత్ భేటీ అయ్యే అవకాశాలున్నాయి. చట్టసభల్లోకి ప్రవేశించే వయసును 21కి తగ్గించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై తీర్మానం చేసేందుకు ఆగష్టు 17-18 తేదీల్లో ఒక రోజు ప్రత్యేక అసెంబ్లీ సెషన్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఇక వర్షాకాల సమావేశాలను సెప్టెంబరు మూడో వారంలో వారంపాటు నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. ఆగస్టులో సీఎం విదేశీ పర్యటనకు ప్రాథమిక షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో.. సెప్టెంబరు రెండో వారం వరకు ఆయన తిరిగి రాష్ట్రానికి వస్తారని, మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలు ఉంటాయనే చర్చ సచివాలయంలో జరుగుతోంది.

# ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం

- గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉత్తమ్ పర్యటన
- పూడికతీత పనులను అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడి





హైదరాబాద్,ఆగస్ట్1 : తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ) ప్రాజెక్టును సందర్శించి, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రాజెక్టుల పరిస్థితులను సమీక్షించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని, సుమారు 56 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులకు జీవనాడిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్‌లో పూడిక వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుండడాన్ని గుర్తించి, ప్రాజెక్ట్ పూడికతీతకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో ప్రాజెక్ట్ నుండి సాగునీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేస్తామన్నారు. అయితే, గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నీటి నిల్వలు కొంత తక్కువగా ఉన్నాయని, ఈ పరిస్థితిని రైతులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీరు నింపకపోవడంపై బీఆర్ఎస్ పార్టీ కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి మండిపడ్డారు. సాంకేతిక లోపాలు, డిజైన్ వైఫల్యాల వల్ల దెబ్బతిన్న ఈ మూడు ప్రాజెక్టుల పునరుద్ధరణ విషయంలో తమ ప్రభుత్వం తీసుకుంటున్న శాస్త్రీయ చర్యలను సెంట్రల్ వాటర్ కమిషన్ కూడా ఏకీభవించిందని వివరించారు. ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమని, అది ప్రాణహిత-చేవెళ్ల పథకంలో భాగమని స్పష్టం చేసిన మంత్రి.. దాన్ని కూడా తామే కట్టినట్లు బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన డ్యాములు 60 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని, కానీ బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టులు మాత్రం కొద్ది ఏళ్లకే ధ్వంసం అయ్యాయని ఎద్దేవా చేశారు. కేవలం ఉమ్మడి నిజామాబాద్ జిల్లానే కాకుండా దక్షిణ తెలంగాణ సాగునీటి పరిస్థితులను కూడా ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం నాగార్జున సాగర్‌కు కూడా ఎగువ నుండి నీళ్లు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయని, రైతాంగానికి సాగునీటి కొరత లేకుండా చూసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ప్రతిభకు పదను పెడితే సాధ్యం కానిదేదీ లేదు

- కమ్యూనికేషన్ స్కిల్స్ ఎల్లవేళలా అవసరం
- నిరంతర అధ్యయనం తోనే ఉన్నతశిఖరాలకు చేరుకుంటాం
- బాసర విద్యార్థులతో మాజీ డిజిపి మహేందర్ రెడ్డి



బాసర,ఆగస్ట్1 : గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెడితే సాధించలేనిది ఏదీ లేదని రాష్ట్ర మాజీ డీజీపీ కె. మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్జీయూకేటీ విశ్వవిద్యా లయంలో పీయూసీ నూతన విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మహేందర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, ఆ ప్రతిభకు సరైన దిశ చూపిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. జీవితంలో ఉన్నత విజయాలను సాధించాలంటే నిరంతర అధ్యయనం, కఠిన క్రమశిక్షణ, సమయపాలన, సానుకూల దృక్పథం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానానికే పరిమితం కాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా కమ్యూనికేషన్ నైపుణ్యాలు, భాషా ప్రావీణ్యం, సబ్జెక్టుపై లోతైన అవగాహన పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి అంశంపై జిజ్ఞాస, విమర్శనాత్మక ఆలోచనా విధానాన్ని అలవర్చుకుంటే విజయాన్ని సులభంగా చేరుకోవచ్చని చెప్పారు. తన విద్యార్థి దశలో ఎదుర్కొన్న అనుభవాలు, కఠోర శ్రమ, పట్టుదల, నైతిక విలువలతో కూడిన జీవనశైలే తనను ఉన్నత స్థానానికి చేర్చాయని ఆయన గుర్తు చేసుకున్నారు. ప్రతి విద్యార్థి పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి సాధన కోసం ప్రతిరోజూ ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. వేగంగా మారుతున్న సాంకేతిక యుగంలో నూతన పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉత్తమ వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జీవన నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని తెలిపారు. డాక్టర్ మహేందర్ రెడ్డి వంటి విశిష్ట వ్యక్తుల అనుభవాలు విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, డీన్లు, అధ్యాపకులు, పరిపాలనాధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉప్పల్ నల్ల చెరువుకు మహర్దశ

## హైడ్రా పునరుద్ధరణతో జలకళ



హైదరాబాద్,ఆగస్ట్1 : ఒకప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగు నీటితో కళ తప్పిన ఉప్పల్ నల్లచెరువు ఇప్పుడు వర్షపు నీటితో కళకళలాడుతోంది. హైడ్రా చేపట్టిన సమగ్ర పునరుద్ధరణ పనుల ఫలితంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు వరద నీటితో నిండిపోయి మళ్లీ జీవం పోసుకుంది. హైడ్రా చేపట్టిన పునరుద్ధరణలో భాగంగా వరద నీరు చెరువులోకి చేరేలా ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసింది. అదే సమయంలో మురుగు నీరు చెరువులోకి రాకుండా ప్రత్యేక బైపాస్ కాలువను నిర్మించింది. దీంతో భారీ వర్షాల సమయంలో వరద నీరు సురక్షితంగా చెరువులోకి చేరుతుండగా, ఎగువ ప్రాంతాల్లో నీటి నిల్వ, ముంపు సమస్యలు గణనీయంగా తగ్గాయి. పునరుద్ధరణలో భాగంగా 10 ఎకరాలకు పైగా ఆక్రమణలను తొలగించి, చెరువు విస్తీర్ణాన్ని దాదాపు 70 ఎకరాలకు పున రుద్ధరించారు. సుమారు రూ.20 కోట్ల వ్యయంతో హైడ్రా ఈప్రాజెక్టును అభివృద్ధి చేస్తోంది. చెరువు జలవ్యవస్థను బలోపేతం చేసేందుకు నాచారం చెరువు, పరిసర ప్రాంతాల నుంచి వరద నీరు చేరే లా రెండు ఇన్‌లెట్లను నిర్మించారు. అలాగే చెరువు పూర్తిగా నిండిన తర్వాత అదనపు నీరు మూసీ నదిలోకి సాఫీగా వెళ్లేలా ఆధునిక ఔట్‌లెట్‌ను ఏర్పా టు చేశారు. జలసంరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రదేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో వాకింగ్ ట్రాక్, బలమైన ప్రధాన కట్ట, చిన్నారుల ఆట స్థలం, ఓపెన్ జిమ్, పచ్చదనంతో కూడిన వినోద ప్రదేశాలను అభివృద్ధి చేస్తున్నారు. కుటుం బాలతో వచ్చి విశ్రాంతి తీసుకునే నగరంలోని ప్రధాన వినోద కేంద్రంగా ఉప్పల్ నల్లచెరువును తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. హైడ్రా తొలి దశలో అభివృద్ధి చేస్తున్న ప్రధాన చెరువుల్లో ఉప్పల్ నల్లచెరువు ఒకటి. ఇప్పటికే మూడు చెరువులను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చిన హైడ్రా, ఉప్పల్ నల్లచెరువును కూడా త్వరలో హైదరాబా ద్‌కు మరో కీలక జలవనరుగా, ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు చర్యలు చేపడుతోంది.

# ఒక్కరోజులో రెండు లక్షలు దాటిన మీసేవ లావాదేవీలు

- తొలిసారి రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు
- దేశంలోనే నెంబర్ వన్ గా మీసేవ ఆన్‌లైన్ ప్లాట్ ఫార్మ్
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 01: ప్రభుత్వ సేవలు, లావాదేవీలను ఆ÷-లనైన్ లో ఒకే వేదిక మీద అందిస్తోన్న మీసేవ మరోక రికార్డును నమోదు చేసింది. శుక్రవారం ఒక్క రోజే 2,20,172 లావాదేవీలు నమోదు అయ్యాయి. ఇలా ఒకే రోజు రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు జరిగాయని ఐటిశాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు వెల్లడించారు. మీసేవ డిజిటల్ ఎ÷-లాట్ ఫామ్ ను మరింతగా అభివృద్ధి చేయటం, సేవలను విస్తృత పరచటం, ఆమేరకు ప్రజల వాడకాన్ని ప్రోత్సహించటంలో ప్రజాప్రభుత్వం చొరవచూపిస్తోంది. దీంతో కొత్త రికార్డులు నమోదవు తున్నాయి. రాష్ట్ర పౌరులకు వేగంగా, పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలను అందించేందుకు మీసేవ వేదికను ప్రభుత్వం నిరంతరం బలోపేతం చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఒక్క రోజులో రికార్డు స్థాయిలో ఎలాంటి అవాంతరాలు లేని లావాదేవీల ద్వారా దేశంలోనే నెంబర్ వన్ గవర్నమెంట్ ఆ÷-లనైన్ ఎ÷-లాట్ ఫార్మ్ గా మీ సేవ నిలిచిందని మంత్రి అన్నారు. రోజు సరాసరి 70 నుంచి 80 వేల కార్యకలాపాలు మీసేవ ద్వారా నమోదవుతాయి. శుక్రవారం ఒకే రోజులో 2.20 లక్షలకు పైగా లావాదేవీలు నమోదయ్యాయి. వీటిల్లో ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఫ్యామిలీ కార్డు, రవాణాశాఖ, ఆదాయ ధృవీకరణ పత్రాల అప్లికేషన్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఘనత తెలం గాణ ప్రభుత్వ డిజిటల్ సేవల వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచిందని మంత్రి ప్రకటించారు. పనితీరును మెరుగు పరచడం, సేవల లభ్యతను విస్తరించడం, కొత్త పౌర సేవలను అందుబా టులోకి తీసుకురావడం, సాంకేతిక, మౌలిక వసతులను బలోపేతం చేయడం లాంటి చర్యల ఫలితంగానే ఈ మైలురాయి సాధ్యమైందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు సేవలను అందించడంలో విశేష కృషి చేసిన నిర్వాహకులు, సాంకేతిక బృందాలను మంత్రి అభినందించారు. మీసేవ ద్వారా ప్రస్తుతం ఫ్యామిలీ కార్డు, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు, వివిధ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ యుటిలిటీ చెల్లింపులు, అలాగే పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సేవలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల్లో డిజిటల్ వేదికల ద్వారా ప్రజలకు సులభంగా అందుబాటులో ఉన్నాయి. అవస రాలకు అనుగుణంగా మరిన్ని సేవలను మీసేవలో చేర్చడం, ఆధునిక సాంకేతికతను వినియోగించడం, సేవల నాణ్యత, వేగం, పారదర్శకతను మరింత మెరుగుపరచడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# గ్రీన్ కారిడార్‌గా ఉపయోగపడ్డ మెట్రో

## అవయవ మార్పిడి కోసం అవయవాల తరలింపు

హైదరాబాద్, ఆగస్టు 01: హైదరాబాద్ మెట్రో రైలు కేవలం నగర వాసులను గమ్యస్థానాలకు చేర్చే రవాణా వ్యవస్థగానే కాకుండా, అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే సంజీవనిలా మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకుంది. తీవ్రమైన ట్రాఫిక్ చిక్కులను అధిగమించి, అవ యవ మార్పిడి చికిత్స కోసం దాత నుంచి సేకరించిన గుండె, ఊపిరితి త్తులను సురక్షితంగా , వేగంగా ఆసుపత్రికి తరలించేందుకు ప్రత్యేక 'గ్రీన్ కారిడార్'గా మారింది. గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దాత నుంచి సేకరించిన గుండె , ఊపిరితిత్తులను సికింద్రాబాద్ పరిధిలోని కిమ్స్ ఆసుపత్రికి అత్యవసరంగా తరలించాల్సి వచ్చింది. రోడ్డు మార్గంలో వెళ్తే ట్రాఫిక్ సమస్యల వల్ల సమయం వృధా అయ్యే ప్రమాదం ఉండటంతో వైద్యులు మెట్రో అధికారులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన హైద రాబాద్ మెట్రో అధికారులు రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుంచి రసూల్‌పురా వరకు ప్రత్యేకంగా మెట్రో ట్రాన్సిట్‌ను ఏర్పాటు చేశారు. మార్గమధ్యలో ఉన్న 13 స్టేషన్లను దాటుకుంటూ, కేవలం 25 నిమిషాల్లోనే 14 కిలోమీటర్ల దూరాన్ని అత్యంత వేగంగా పూర్తి చేసి అవయవాలను సురక్షితంగా చేర్చారు. అవయవ మార్పిడి చికిత్సల్లో ప్రతి నిమిషం ఎంతో విలువైనది. ఈ విషయాన్ని గుర్తించిన వైద్య బృందాలు , మెట్రో సిబ్బంది పరస్పరం పూర్తి సమన్వయంతో వ్యవహరించి ఈ మిషన్‌ను విజయవంతం చేశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అదే సమయంలో అత్య వసర అవయవాల రవాణాకు ఎలాంటి అంతరాయం కలగకుండా అధికా రులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సరైన సమయానికి డోనర్ అవయవాలు కిమ్స్ ఆసుపత్రికి చేరడంతో బాధితుడికి అవయవ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించేందుకు మార్గం సుగమమైంది. అత్యవసర వైద్య సేవలకు నిరంతరం అండగా నిలుస్తున్న హైదరాబాద్ మెట్రో సేవలకు నగరవాసుల నుంచి, వైద్య వర్గాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. నిమిషాల విలువను గుర్తించి, కచ్చితమైన ప్రణాళికతో సమయానికి అవయవాలను చేర్చి ఒక ప్రాణాన్ని నిలబెట్టడంలో మెట్రో పోషించిన పాత్ర ప్రశంసనీయం. వేగవంతమైన ప్రయాణానికే కాదు, మానవతా దృక్పథంతో ప్రాణాలు కాపాడటంలోనూ తాను ఎప్పుడూ ముందే ఉంటానని హైదరాబాద్ మెట్రో మరోసారి నిరూపించింది.

# తల్లి పాలే శిశువుకు తొలి టీకా

- తల్లిపాల శ్రేష్టతను గుర్తించాలి
- ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలి
- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు



హైదరాబాద్, ఆగస్టు 01: పుట్టిన గంటలోపే తల్లిపాలు ప్రారంభించాలి.. తొలి ఆరు నెలలు తల్లిపాలే ఇవ్వాలని మంత్రి సీతక్క అన్నారు. అంగన్వాడీ, మహిళా శిశు సం క్షేమ శాఖ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి సీతక్క అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి తల్లి, ప్రతి కుటుంబానికి తల్లిపాల ప్రాముఖ్యతను చేరవేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. తల్లి పాలు ప్రతి శిశువుకు తొలి హక్కు, ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ పోషకాహారమని మంత్రి పేర్కొన్నారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు శిశువుకు తొలి రోగనిరోధక టీకాలా పనిచేస్తాయని తెలిపారు. ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించడం, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వడం, అనంతరం వయస్సుకు తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని మంత్రి చెప్పారు. తల్లి పాల వారోత్సవాలను కేవలం అధికారిక కార్యక్రమాలుగా కాకుండా ప్రజల్లో చైతన్యం కలిగించే ఉద్యమంగా నిర్వహించాలని మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, గ్రామాలు, వార్డుల్లో అవగాహన సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించి తల్లిపాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, సూపర్వైజర్లు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి గర్భిణీలు, బాలింతలు, ఆరు నెలల లోపు శిశువుల తల్లులు, రెండేళ్ల లోపు పిల్లల తల్లులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలని మంత్రి సూచించారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ శాస్త్రీయ అవగాహన కల్పించాలని, కుటుంబ సభ్యులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని కోరారు. ప్రసవం జరిగిన ప్రతి ఆసుపత్రిలో పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు అందేలా వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. తల్లి పాల ప్రోత్సాహంలో అంగన్వాడీ వ్యవస్థ కీలక పాత్ర పోషించాలని, ప్రతి అంగన్వాడీ కేంద్రం తల్లి శిశు ఆరోగ్యానికి మార్గదర్శక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. పోషకాహార లోపం లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి శిశువుకు ఆరోగ్యవంతమైన జీవితానికి తల్లి పాలే బలమైన పునాది అని అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, మహిళా సంఘాలు, అంగన్వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ప్రతి కుటుంబం భాగస్వాములు కావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రతితల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించేలా సమాజమంతా బాధ్యతతో ముందుకు రావాలని కోరారు.

# అప్పుల బాధ తట్టుకోలేక వ్యాపారి ఆత్మహత్య

హైదరాబాద్,ఆగస్ట్1 : నగరంలోని మల్లాపూర్ ప్రాంతంలో తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. వ్యాపారంలో వచ్చిన నష్టాలు, రోజురోజుకూ పెరుగుతున్న అప్పుల భారం తట్టుకోలేక ఓ కూరగాయల వ్యాపారి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిటికీ గ్రిల్‌కు చున్నీతో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు.

సమాచారం అందుకున్న నాచారం పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. తన భర్త బాధ పడటం చూడలేకపోయిన భార్య.. ఆయనకు ఆర్థికంగా సాయం చేసేందుకు తీవ్రంగా యత్నించింది.

డబ్బును సర్దుబాటు చేసుకుని ఇంటికి తిరిగి వచ్చేలోపు ఈ దారుణం జరిగిపోయింది. తన భర్త అప్పుల భారం తట్టుకోలేకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నాడని నాచారం పోలీస్ స్టేషన్‌లో మృతుని భార్య ఫిర్యాదు చేసింది. చేతికి డబ్బులు అంది భర్త కష్టాలు తీరుతాయనుకున్నలోపే ఇలా ప్రాణాలు కోల్పోవడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

# న్యాయవాది దారుణం హత్య

- విచక్షణారహితంగా వేటకొడవళ్లతో నరికి హత్య



నాగర్‌కర్నూల్,ఆగస్ట్1 :జిల్లాలో ఓ న్యాయవాది అత్యంత దారుణంగా హత్యకు గురయ్యారు. పెంట్లవెల్లికి చెందిన ఆర్ఎం పీ వైద్యుడు, న్యా యవాది మల్లయ్య (55)పై దుండగులు పథకం ప్రకారం దాడి చేసి వేటకొడవళ్లతో నరికి చం పారు. ఈ ఘటన జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. మల్లయ్య పెంట్లవెల్లిలో క్లినిక్ నిర్వహిస్తూ ఆర్ఎంపీ వైద్యుడిగా, న్యాయవాదిగా జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆయన క్లినిక్ లో ఉండగా ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషు లు ఆరోగ్య సమస్య ఉందని చెప్పి అక్కడికి వచ్చారు. వారిని పరిశీలిస్తున్న సమయంలో ఒక్కసారిగా మల్లయ్య కళ్లలో కారం చల్లి దాడికి పాల్పడ్డారు. అనంతరం ఆయనను క్లినిక్ నుంచి బయటకు ప్రధాన రహదారిపైకి లాక్కెళ్లి వేటకొడవళ్లతో విచక్షణారహితంగా నరికి హత్య చేశారు. తీవ్ర గాయాలతో మల్లయ్య అక్కడికక్కడే మృతిచెందారు. దాడి అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మల్లయ్య హత్య వెనుక భూ వివాదాలే ప్రధాన కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# (మొదటిపేజీ తరువాయి)

## సోషల్ మీడియాతో పాత్ర మరువలేనిది

న్యూస్‌ను రీల్స్ రూపంలో చూస్తోందని కేటీఆర్ అన్నారు. తెలంగాణలోనే ఎన్నో సందర్భాల్లో వార్తను వార్తలా రాయలేని పరిస్థితి లేదా..? ఒక అమ్మాయి మీద లైంగిక దాడి జరిగింది.. కేంద్ర మంత్రి కుమారుడు ఈ దుర్మార్గమైన పని చేశాడని ఆ అమ్మాయి తల్లీదండ్రులు వచ్చి ఫిర్యాదు చేస్తే వారం రోజులు ఏ మీడియా రిపోర్ట్ చేసింది..? సోషల్ మీడియానే లేకపోతే ఆ అమ్మాయికి న్యాయం జరిగే పరిస్థితి ఉందా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సెమినార్‌లో 'రాజ్యాంగం ? ప్రజాస్వామ్యం ? పత్రికా స్వేచ్ఛ' అంశంపై కేటీఆర్ ప్రసంగిం చారు. లగచర్లలో గిరిజనుల మీద అకృత్యాలు జరిగితే ఏ మీడియా రాసింది.. నేను ఈ మాట అంటున్నందుకు దయచేసి ఎవరూ ఏం అనుకోవద్దు.. వాస్తవాలు చెబితే చేదుగానే ఉం టాయి. ఈ రోజున్న పరిస్థితుల్లో డైరెక్టుగా శాసనసభలో, బయట ప్రభుత్వంలో ఉన్న పెద్దలు జర్నలిస్టుల పట్ల అసహనం వ్యక్తం చేస్తే కూడా ఏ మీడియా ప్రశ్నించింది.. ? హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమి విషయంలో విద్యార్థులు కదం తొక్కే దాకా ఏ మీడియా రాసింది.. ?ఎక్కడుంది పరిశోధనాత్మక జర్నలిజం.. ఉందా..? నేను ఈ మాట అంటే మీలో చాలా మందికి మళ్లీ నాలో అహంకారం కనబడొచ్చు. నేను ఉన్నది ఉన్నట్టుగా అడుగుతున్నా.. ఉన్నదా రాసే పరిస్థితి.. చెప్పే పరిస్థితి ఉన్నదా..? అందరి ముందటే అడుగుతున్నా స్వేచ్ఛగా, నిర్భీతిగా పరిశోధనాత్మక కథనాలు వస్తున్నాయా..? వాస్తవాలు చెబితే నచ్చవన్నారు.

## తెలంగాణ రైజింగ్-2047'లో భాగస్వామ్యం అవ్వండి



అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యంతో సాకారమయ్యే అభివృద్ధి విజన్ అని వివరించారు. ఆర్థిక వృద్ధితో పాటు సామాజిక పురోగతి సమాంతరంగా సాగేలా... ఆవిష్కరణల ద్వారా ఉపాధి అవకాశాలు సృష్టించేలా... అభివృద్ధి ప్రతి నియోజకవర్గానికి, దాని ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా ఈ బృహత్తర ప్రణాళికను రూపొందించామన్నారు. ఈ లక్ష్య సాధనలో ప్రభుత్వం... పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ రంగం భాగస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. సీఎస్ఆర్ ద్వారా సమాజంలో మార్పు తెచ్చే కార్యక్రమాల అమలుకు, పరిశ్రమల స్థాపనకు సంబంధించి ప్రతి దశలోనూ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు భాగస్వామిగా, సహాయకారిగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు భరోసానిచ్చారు. ఏఐ, డేటా గవర్నెన్స్, సైబర్ భద్రత వంటి అంశాలు కార్పొరేట్ ప్రపంచంలో కొత్త సవాళ్లుగా మారుతున్న నేపథ్యంలో కంపెనీ సెక్రటరీలు... కేవలం కంప్లయన్స్ నిపుణులుగా కాకుండా స్ట్రాటజిక్ బోర్డ్ అడ్వైజర్లుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కంపెనీలు కేవలం లాభార్జనే కాకుండా... సస్టైనబుల్, ఎథికల్ వ్యాపార వృద్ధిపై దృష్టి సారించాలని సూచిం చారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన కాన్‌స్టిట్యూయెన్సీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(సీడీఎక్స్)కు నాలెడ్జ్ పార్ట్ నర్ గా ఉండేందుకు ముందుకొచ్చిన ' ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా' ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్పొరేట్ కంపెనీలు, సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఎస్ఐ ప్రతినిధులు మహదేవ్ తిరునగరి, ఎం.దామోదరన్, శిల్పా, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి జలాలపై తెలంగాణకు నష్టం

ఉందని, ట్రిబ్యునల్ రక్షణ కలిగిన కేటాయింపులు చెల్లవని పేర్కొంటూ తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ కోరడం తెలంగాణ హక్కులను కాలరాయడమేనని కవిత అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి గోదావరి జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వకుండా, తెలంగాణ ప్రజల హక్కులను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

## పేపర్ లీకేజీ బిల్లుకు చట్టబద్ధత

సవరణలు తెస్తూ కొత్త బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లును కాంగ్రెస్ సహా అనేక ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఈ బిల్లు ద్వారా పూర్తిస్థాయిలో పేపర్ లీకేజీలను అరికట్టలేమని ప్ర తిపక్షాలు వ్యాఖ్యానించాయి. అయితే, పేపర్ లీకేజీలను అడ్డుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందువల్లే కొత్త బిల్లును రూపొందించామని కేంద్రం సమర్థించు కుంది. కొత్త బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే కఠిన శిక్షలు, జరిమానాలు విధిస్తారు. ఈ బిల్లులోని ప్రధానాంశాలివి. పేపర్ లీకేజీ కేసులను విచారించేందుకు ప్రతి రాష్ట్రంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తారు. 90 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి, శిక్షలు విధించేలా ఈ కోర్టులు నిరంతరం పని చేస్తాయి. పాత బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే వ్యక్తిగతంగా రూ.10 లక్షల వరకు జరిమానా విధించేవారు. కొత్త బిల్లు ప్రకారం రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. ఒకవేళ సంస్థలు, వ్యవస్థీకృతంగా నేరానికి పాల్పడితే రూ.10 కోట్ల వరకు జరిమానా విధిస్తారు. అలాగే, గతంలో గరిష్ఠంగా మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు శిక్ష విధించేవారు. ఇప్పుడు ఐదు నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. ఇంతకుముందు కేంద్ర దర్యాప్తు సంస్థలు పేపర్ లీకేజీ కేసులపై విచారణ జరిపేది. కానీ, ఇకపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలు ఈ కేసుల్ని విచారిస్తాయి. గతంలో పేపర్ లీకేజీ కేసుల విచారణకు కాల పరిమితి అంటూ లేదు. కొత్త బిల్లు ప్రకారం ఈ కేసుల విచారణను రెండు నెలల్లో పూర్తి చేయాలి.

## డిజిటల్ బాటలో వ్యవసాయ మార్కెట్లు

తెస్తూ కొత్త బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లును కాంగ్రెస్ సహా అనేక ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఈ బిల్లు ద్వారా పూర్తిస్థాయిలో పేపర్ లీకేజీలను అరికట్టలేమని ప్ర తిపక్షాలు వ్యాఖ్యానించాయి. అయితే, పేపర్ లీకేజీలను అడ్డుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందువల్లే కొత్త బిల్లును రూపొందించామని కేంద్రం సమర్థించుకుంది. కొత్త బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే కఠిన శిక్షలు, జరిమానాలు విధిస్తారు. ఈ బిల్లులోని ప్రధానాంశాలివి. పేపర్ లీకేజీ కేసులను విచారించేందుకు ప్రతి రాష్ట్రంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తారు. 90 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి, శిక్షలు విధించేలా ఈ కోర్టులు నిరంతరం పని చేస్తాయి. పాత బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే వ్యక్తిగతంగా రూ.10 లక్షల వరకు జరిమానా విధించేవారు. కొత్త బిల్లు ప్రకారం రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. ఒకవేళ సంస్థలు, వ్యవస్థీకృతంగా నేరానికి పాల్పడితే రూ.10 కోట్ల వరకు జరిమానా విధిస్తారు. అలాగే, గతంలో గరిష్ఠంగా మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు శిక్ష విధించేవారు. ఇప్పుడు ఐదు నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. ఇంతకుముందు కేంద్ర దర్యాప్తు సంస్థలు పేపర్ లీకేజీ కేసులపై విచారణ జరిపేది. కానీ, ఇకపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలు ఈ కేసుల్ని విచారిస్తాయి. గతంలో పేపర్ లీకేజీ కేసుల విచారణకు కాల పరిమితి అంటూ లేదు. కొత్త బిల్లు ప్రకారం ఈ కేసుల విచారణను రెండు నెలల్లో పూర్తి చేయాలి.మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి పలు సమస్యలను వివరించారు. నాణ్యమైన మొక్కలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచడం, ప్రతి మండలంలో ఆయిల్ పామ్ గెలల సేకరణ కేంద్రం ఏర్పాటు, బ్యాంకు రుణాలు, యంత్ర పరికరాలపై సబ్సిడీ, కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటు వంటి అంశాలపై వినతిపత్రం అందజేశారు.దీనిపై స్పందించిన మంత్రి, ఆయిల్ పామ్ రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ దేశంలోనే ఆయిల్ పామ్ సాగుకు అత్యంత అనుకూల ప్రాంతమని, ఈ పంట ద్వారా రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. రైతులు కోరిన వెంటనే నాణ్యమైన మొక్కలు అందేలా కంపెనీలకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే కోసం పోలీసుల గాలింపు

ఏలూరు,ఆగస్ట్1 : గుంటూరు తూర్పు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు ముస్తఫా కోసం ఏలూరు జిల్లా నూజివీడు పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు ఆయన కుమారుడు బషీర్‌పై పలు క్రిమినల్ కేసులు నమోదు కావడంతో ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో వారి వివరాలు తెలిస్తే చెప్పాలని కోరుతూ సోషల్ మీడియా వేదికగా ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. పొగాకు లోడుతో వెళుతున్న వాహనాన్ని బలవంతంగా తీసుకెళ్లడం, బాధితులను డబ్బు కోసం అపహరించడం, కులం పేరుతో దూషించడం వంటి ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే ముస్తఫా, ఆయన కుమారుడు బషీర్‌పై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి ముస్తఫా, బషీర్ పోలీసులకు కనిపించకుండా తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అదే సమయంలో వారి ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమాచారం అందించాలని కోరుతూ నూజివీడు పోలీసులు సోషల్ మీడియాలో ప్రకటన విడుదల చేశారు. ముస్తఫా, బషీర్ వివరాలు తెలిసిన వారు 9154876161, 9154876238 నంబర్లకు సమాచారం అందించి దర్యాప్తునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు హామీ ఇచ్చారు. కాగా, ఈ వ్యవహారం ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# భద్రాచలం వల్ల నిలకడగా గోదావరి

- 56 అడుగులకు చేరిన నీటిమట్టం
- భద్రాచలం చుట్టుపక్కల చేరిన వరదనీరు
- అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి తుమ్మల



భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్1 : భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా ఉంది. శనివారం ఉదయం 11 గంటల నుంచి 56 అడుగుల వద్ద నిలకడగా ప్రవహిస్తోంది. నీటిమట్టం పెరగడంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. నీటిమట్టం స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరోవైపు భద్రాచలం చుట్టుపక్కల ప్రాంతాల్లోని రహదారుల పైకి వరద నీరు చేరాయి. దీంతో భద్రాచలం నుంచి దుమ్ముగూడెం, చర్ల, వాజేడు, వెంకటాపురం, వి.ఆర్ పురం, వేలేరుపాడు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదలతో భద్రాద్రి కొత్తగూడెం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. గోదావరి నీటిమట్టం 55.90 అడుగులకు చేరింది. దాదాపు 15,84,657 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం గోదావరి వద్ద మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. మరోవైపు భద్రాచలం గోదావరి వరదలపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫోన్‌లో మాట్లాడారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశిం చారు.అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రాచలంలోకి వరద నీరు రాకుండా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గోదావరి వరదలపై ఉన్నతాధికారుల తో ఎప్పటికప్పుడు పరిస్థితిని మంత్రి సమీక్షించారు. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఇకపోతే భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చి, రెండు రోజుల వ్యవధిలోనే సుమారు 50 అడుగులు దాటి ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి 53 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం శనివారం ఉదయానికి 55.1 అడుగులకు పెరిగింది. దీంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న జిల్లా యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. భద్రాచలం-వెంకటాపురం మార్గంలో రహదారిపైకి వరద నీరు చేరింది. దీంతో భద్రాద్రి ఏజెన్సీలోని వివిధ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక, చర్ల మండలం వీరాపురం ఇసుక ర్యాంపును గోదావరి వరద చుట్టుముట్టింది. అక్కడి గోదావరి పాయలోని ఇసుక ర్యాంపులో లారీ డ్రైవర్లతోపాటు 46 మంది ర్యాంపు సిబ్బంది చుక్కుకుపోయారు. లారీలు కూడా అందులోనే ఉన్నాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు.. రెస్క్యూ బృందాలను రంగంలోకి దింపారు. ఆ బృంద సభ్యులు యంత్రాలు, తెప్పలపై వెళ్లి ర్యాంపు సిబ్బందిని, డ్రైవర్లను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అయితే, ర్యాంపు సిబ్బందిని రక్షించేందుకు తెప్పపై వెళ్తున్న చర్ల సీఐ రాజు వర్మకు తృటిలో ప్రమాదం తప్పింది.వరదలో కొద్దిదూరం వెళ్లాక తెప్ప తిరబడింది. దీంతో సీఐ చాకచక్యంగా అదే తెప్పను పట్టుకొని సురక్షితంగా ఒడ్డుకు చేరారు. అయితే, గోదావరి వరదల నేపథ్యంలో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బలగాలను ఉన్నతాధికారులు రంగంలోకి దింపారు. భద్రాద్రి కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్‌రాజు, భద్రా చలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ సహా ఇతర ఉన్నతాధి కారులందరూ భద్రాచలంలోనే ఉండి వరద ఉధృతిని, సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. పరీవాహకంలో ఉన్న పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో 49 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశారు. గోదావరి వరదల కారణంగా భద్రాచలం-వెంకటాపురం మార్గంలో వివిధ గ్రామాల్లోకి, రహదారులపైకి వరద నీరు చేరింది. దీంతో ఆయా ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. పలు గ్రామాల్లో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సేవలందిస్తున్నాయి.

## ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 01: ధరణి అక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ధరణి నుంచి భూభారతి వరకు లావాదేవీలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. పేదల భూములను కాజేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదన్నారు. మరోవైపు భూముల ధరల సవరణతో రిజిస్ట్రేషన్ల ఆదాయం 20శాతం వరకు పెరిగిందని పొంగులేటి తెలిపారు. సచివాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని హెచ్చరించారు. ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా పరిశీలిస్తున్నామని, నిజాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. అంతేగాక ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరిందో తేలుస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ఆ భూములను ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు? తర్వాత ఎందుకు తొలగించారు? అనే ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు.కొత్తగా ఒక్క సెంటు భూమి కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఉన్న జాబితానే కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తైందని, ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి విషయంలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం చర్చిస్తోందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, ఎవరికీ అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించే ప్రశ్నే లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. క్యూర్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీళ్లు కారుతున్నాయని మీడియా దృష్టికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అది గత ప్రభుత్వ నాణ్యతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లను కూడా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్దిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే ÷నైల్ బిల్లులు చెల్లిస్తుందని మంత్రి ప్రకటించారు. భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్స్ శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వార్షిక ఆదాయం సుమారు రూ.13 వేల కోట్లు ఉండగా, గత ఏడాది అది రూ.15 వేల కోట్లకు చేరిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.18 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు.

## లోకేశ్‌కు ప్రధాని అభినందనలు

### బాగా పనిచేస్తున్నావంటూ కితాబు



విజయనగరం,ఆగస్ట్1 : భోగాపురంలోని అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్ర మం అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ.. ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ప్రధానికి వీడ్కోలు పలికేందుకు వచ్చిన లోకేశ్ భుజం తట్టి.. 'నువ్వు చాలా బాగా పనిచేస్తు న్నావు.. శభాష్ లోకేశ్' అని ప్రశంసించారు. భోగాపురం విమానాశ్రయం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ప్రారంభోత్సవం విజయవంతంగా నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంపై కూడా ప్రధాని సంతృప్తి వ్యక్తం చేశారు. నారా లోకేశ్ పనితీరును ప్రధాని మోదీ మెచ్చుకోవడం ఇదేం తొలిసారి కాదు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాని పాల్గొన్న పలు ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో లోకేశ్ కీలక పాత్ర పోషించిన సందర్భాల్లోనూ మోదీ ఇదే తరహాలో ఆయనను అభినందించారు. ముఖ్యంగా 'యోగాంధ్ర' కార్యక్రమం ద్వారా ప్రపంచ రికార్డు స్థాయిలో యోగా నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై ప్రధాని ప్రశంసలు కురిపించారు. తాజాగా భోగాపురం పర్యటన సం దర్భంగా మరోసారి లోకేశ్‌ను ఆప్యాయంగా అభినందించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

## డీలిమిటేషన్‌తో తమిళనాడుకు మోసం

### ప్రజాస్వామిక హక్కులు దూరం చేసే యత్నం

### విపక్షనేత రాహుల్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఆగస్టు 01 : నియోజకవర్గ పునర్విభజన బిల్లును కేంద్రం మరోసారి పార్లమెంటు ముందుకు తీసుకురానుందన్న వార్తల నడుమ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్‌ను తమిళనాడు ప్రజాస్వామిక హక్కులను దూరం చేసే కుట్రగా అభివర్ణించారు. తమిళనాడును బలహీన పరిచేలా బిల్లును రూపొందించారని అన్నారు. ఈ బిల్లును వీగిపోయేలా చేయాలని జాతీయ, ప్రాంతీయ పార్టీలకు పిలుపునిచ్చారు. బిల్లుకు మద్దతు ఇవ్వడమంటే తమిళనాడుకు ద్రోహం చేయడమేనని అన్నారు. తమిళనాడు వ్యక్తులు ఎవరూ ఈ బిల్లుకు మద్దతు ఇవ్వకూడదని అన్నారు. ప్రతి వ్యక్తీ బిల్లును వ్యతిరేకించాలని అన్నారు. ప్రతి తమిళపార్టీ, జాతీయ పార్టీ బిల్లు వీగిపోయేలా చేయాలని కోరారు. ఇటీవల పశ్చిమబెంగాల్, మహారాష్ట్రలోని పరిణామాల నేపథ్యంలో పార్లమెంటులో ఎన్డీయే బలం పెరిగిందన్న వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం మరోసారి మహిళా రిజర్వేషన్, నియోజకవర్గ పునర్ విభజన బిల్లులను పాస్ చేయించుకునేందుకు ప్రయత్నించవచ్చన్న కామెంట్స్ వినిపించాయి. ఇటీవల కాంగ్రెస్‌తో విభేదాల నేపథ్యంలో డీఎంకే కూడా బిల్లు విషయంలో మెత్తబడే అవకాశం ఉందన్న వార్తలు వచ్చాయి. ఈ విషయమై ఇటీవల డీఎంకే నేత టీకేఎస్ ఈలంగోవన్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్‌తో పునర్ విభజనకు లంకె పెట్టి బిల్లు పాస్ చేయించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని అన్నారు. ఈ విషయంలో పలు పార్టీలు రకరకాల సూచనలు ఇచ్చాయని, అయితే, డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాల సీట్లపై ప్రభావం పడకూడదని అన్నారు.

## గ్రూప్ నోటిఫికేషన్ రాకపోవడంపై మనస్తాపం

### ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు



ఖమ్మం,ఆగస్ట్1 : గ్రూప్స్ నోటిఫికేషన్ రావడం లేదని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ముదిగొండ మండలంలో కలకలం రేపింది. యువతకు ఉద్యోగాలు హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కాలయాపన చేస్తుండడంతో విసిగిపోయిన న్యూ లక్ష్మీపురంవాసి గద్దం వేణు కుమార్ ఎలుకల మందు, ఇతర మాత్రలు తీసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం ఐసీయూలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న అతడు తాను ఎందుకు ఆత్మహత్యకు ప్రయత్నించాడో సూసైడ్ లేఖలో వెల్లడించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం ముత్తారం శివారులోని ప్లలె చెరువులోని మిషన్ భగీరథ ప్లాంట్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న వేణు కుమార్ పీజీ వరకూ చదివాడు. గత అయిదేళ్లుగా గ్రూప్స్ కోసం ప్రిపేర్ అవుతున్నాడు. ప్రతి రోజు ఎ÷-లాంటు వద్దకు వెళ్లి.. పని చూసుకుంటూ.. అక్కడే చదువుకుని సాయంత్రం ఇంటికి వస్తాడు. రోజులానే శనివారం కూడా ఇంట్లో నుంచి వెళ్లాడు.సాయంత్రం సమయంలో నిరుద్యోగుల వాట్సాప్ గ్రూప్‌లో సూసైట్ నోట్ పోస్ట్ చేసి అతడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గ్రూపులో ఉన్నవారు అప్రమత్తమై వెంటనే అతడి తండ్రికి సమాచారం ఇవ్వగా.. వెళ్లి చూసేసరికి వేణు అపస్మారక స్థితిలో ఉన్నాడు. హుటాహుటిన అతడిని వైద్య చికిత్స నిమిత్తం ఖమ్మంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వేణు ఆత్మహత్యకు ప్రయత్నించిన చోట ఎలకల మందు, గుర్తు తెలియని మాత్రలను గుర్తించారు. ప్రస్తుతం ఐసీయూలో ఉన్న వేణు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. గ్రూప్ నోటిఫికేషన్ ఇవ్వడంలేదని మనస్తాపానికి గురై తను ఆత్మహత్యాయత్నం చేశానని సూసైడ్ లేఖలో వేణు కుమార్ వెల్లడించాడు.

# సంపాదకీయం

## పార్లమెంట్‌ను సాగనివ్వని లాఠీఛార్జ్, పెల్లెట్ గన్స్ !

పార్లమెంట్ సజావుగా సాగడం లేదు. వారం దాటినా కార్యక్రమాలు చేపట్టలేక పోయారు. కేవలం పేపర్ లీక్ బిల్లు మాత్రం ఆమోదం పొందింది. ఇక అనేకానేక సమస్యలు ఉన్నా వాటిపై చర్చ సాగుతుందన్న నమ్మకం లేదు. ఎందుకంటే గతంలోనూ ఇలాగే సాగింది. గత పార్లమెంట్ రికార్డును పరిశీలిస్తే ఇదే కనిపిస్తుంది. విపక్షాలు కేవలం ఆందోళనలతో పార్లమెంట్‌ను స్తంభింప చేస్తున్నారు. పార్లమెంట్‌లో లాఠీఛార్జ్‌పై చర్చకు పట్టుబట్టడం ద్వారా తమ మొండి వైఖరిని కనబరుస్తున్నారు. పార్లమెంట్ బయటా ప్లకార్డులతో ప్రదర్శనలు చేస్తున్నారు. విద్యార్థులపై లాఠీఛార్జ్, పెల్లెట్ గన్స్ వాడడంపై నిలదీస్తున్నారు. అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తుండడంతో సభ సాగడం లేదు. ఇలా ఉభయసభలు రోజూ వాయిదా పడుతూనే ఉన్నాయి. జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలపై పోలీసులు జరిపిన లాఠీ ఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే బలప్రయోగానికి దిగడంపై ప్రతిపక్ష పార్టీలు హక్కుల సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. అయితే జంతర్ మంతర్ ఘటనలో పలుఉవరు పోలీసులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. కొందరి తలలు పగిలాయి. ఎందరో రక్తమోడారు. దీనిపై ఎవ్వరూ మాట్లాడడం లేదని ఆయా కుటుంబాలు వాపోతున్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే పోలీసులు రెండురకాల ఒత్తిళ్లను ఎదుర్కొంటుంటారు. ఆందోళనలను అణచివేయడంతో పాటు, తమతను తాము కాపాడుకుంటూ, పైఅధికారులను కాపాడాలి. ఈ సందర్భంగా వారు విధిలేని సమయంలో లాఠీఛార్జ్‌కు పాల్పడాల్సి వస్తుంది. ఇకపోతే అనేక సందర్భాల్లో అతిగా కూడా వ్యవహరించిన సంఘటనలు ఉన్నాయి. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత ప్రకారం ఎలాంటి గుంపునైనా చెదరగొట్టడానికి నోటీసులు ఇచ్చిన తర్వాతే బలప్రయోగం చేయాలి. మానవ హక్కుల కమిషన్ నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్, హెచ్చరికల తర్వాతే అత్యల్ప బలాన్ని ఉపయోగించాలి. రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులను క్షేత్రస్థాయిలో పోలీసులు పూర్తిగా కాలరాస్తున్నారు. అరెస్టు సమయంలో పాటించాల్సిన చట్టబద్ధమైన పక్రియలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. అరెస్టు నిబంధనలు ఎల్లప్పుడూ పాటిస్తున్నామని కేవలం 41 శాతం మంది పోలీసులు మాత్రమే అంగీకరిస్తున్నారు. అరెస్టు చేసిన వ్యక్తులకు కారణాలు చెప్పడం, వైద్య పరీక్షలు నిర్వహించడం వంటివి సరిగ్గా జరగడం లేదు. నిందితులు తమ న్యాయవాదిని సంప్రదించే హక్కును శాశ్వతంగా రద్దు చేయాలని 20 శాతం మంది పోలీసులు వాదిస్తున్నారు. లాఠీఛార్జీలు, హింసాత్మక సంఘటనల్లో గాయపడిన పౌరుల లెక్కల విషయంలో అధికారిక గణాంకాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. మానవ హక్కుల ఉల్లంఘనలు, కస్టడీ మరణాల వివరాల సేకరణలో మన డేటా వ్యవస్థ విఫల మవుతోంది. పోలీస్ వ్యవస్థలో సమూల సంస్కరణలు తేకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. పౌరుల హక్కుల రక్షణతో పాటు చట్ట పాలన సక్రమంగా సాగేలా చూడటమే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష. ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమ మార్గాలను ఎంచుకోవడం పోలీసు వ్యవస్థకే తీవ్ర నష్టం కలిగిస్తుంది. పోలీసులు చట్టానికి లోబడి పనిచేసేలా ఉన్నతాధికారులు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. శిక్షణ సమయంలో మానవ హక్కుల పట్ల అవగాహన పెంచడం ద్వారానే పౌర హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుంది. కానీ స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా 2025 సర్వేలో వెల్లడైన నిజాలు అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. 17 రాష్ట్రాల్లోని 8,276 మంది పోలీసుల అభిప్రాయాలను సేకరించగా విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. పోలీసు శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఎక్కువ మంది తమ చర్యలపై ఎలాంటి విచారణ ఉండకూడదని భావిస్తున్నారు. ఈ సర్వేలో వెల్లడైన గణాంకాలు దేశంలో పోలీసుల అధికార దుర్వినియోగానికి అద్దం పడుతున్నాయి. సర్వేలో పాల్గొన్న వారిలో 70 శాతానికి పైగా పోలీసులు బాధ్యతల నిర్వహణలో బలప్రయోగం చేసినా తమపై ఎలాంటి శిక్ష పడకూడదని స్పష్టం చేస్తున్నారు. కోర్టు విచారణ లేకుండానే అనుమానితులను అరెస్టు చేసి డిటైన్ చేసే అధికారం పోలీసులకు ఉండాలని 69 శాతం మంది కోరుకుంటున్నారు. ప్రజల్లో భయం పుట్టించడానికి కఠిన పద్ధతులు ఉపయోగించడం అత్యంత అవసరమని 55 శాతం మంది పోలీసులు అభిప్రాయపడ్డారు. నిరసనకారులపై లాఠీ ఛార్జీలు, టియర్ గ్యాస్ ప్రయోగాలు చూస్తున్నప్పుడు ప్రతీ ఒక్కరి మనసులో మెదిలే ప్రశ్న ఇది. నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించడానికి సమాజం నుంచి వస్తున్న ఒత్తిడే కారణమని పోలీసులు చెబుతున్నారు. శాంతి భద్రతల పరిరక్షణ పేరుతో అమాయకులు సైతం పోలీసుల ఆగడాలకు బలవుతున్నారు. నిందితులపై తీవ్రంగా విరుచుకుపడటానికి ప్రజల ఒత్తిడే ప్రధాన కారణమని మూడింట రెండు వంతుల మంది పోలీసులు చెబుతున్నారు. . నేరాల నియంత్రణకు అసాంఘిక శక్తుల ముందస్తు అరెస్టులు చాలా ఉపయోగపడతాయని 48 శాతం మంది స్పష్టం చేశారు. నిర్బంధాల కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని 43 శాతం మంది కోరుతున్నారు. 2024 రైతు ఆందోళనలు, మణిపూర్ నిరసనల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు గాయపడినా ఎన్‌సిఆర్‌బి రికార్డుల్లో కేవలం ఇద్దరేనని చూపించారు. ఈ క్రమంలో ఆందోళనల సమయంలో పోలీసుల తీరును విమర్శించే వారు, వాటిని ఎలా కంట్రోల్ చేయాలో చెప్పాల్సి ఉంది. పోలీసులకు సరైన దిశానిర్దేశం చేయాలి.

## విద్యార్థుల ముసుగులో అసాంఘికశక్తుల దాడి

- మీ నిరసనలు సరే..మా సంగతేంటి?
- దాడిలో గాయపడ్డ పోలీస్ కుటుంబాల ఆందోళన
- తమకు న్యాయం చేయాలని పలువురు డిమాండ్







న్యూఢిల్లీ, ఆగస్టు 01 : జంతర్‌మంతర్ వద్ద ఇటీవల జరిగిన నిరసనల సందర్భంగా గాయపడిన ఢిల్లీ పోలీసు సిబ్బంది కుటుంబాలు న్యాయం కోసం డిమాండ్ చేశాయి. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ఆందోళనకారులు.. రాళ్లు రువ్వడం సహా చెప్పులతో దాడి చేశారని ఆరోపిస్తూ శుక్రవారం మీడియా ఎదుట బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. దేశ రాజధాని దిల్లీలో జరిగిన విద్యార్థుల ఆందోళనల సమయంలో ఎంతో మంది పోలీసులు గాయపడినా.. వారి గురించి ప్రజలకు పట్టట్లేదని ఆయా కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఈ నిరసనల్లో గాయపడిన కొంతమంది పోలీసుల కుటుంబసభ్యులు శుక్రవారం మీడియా ముందుకొచ్చారు. నాటి సంఘటనలను గుర్తుచేసుకుంటూ తమకు కూడా న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గాయపడిన ఓ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఏసీపీ) కుమారుడు మాట్లాడుతూ తన తండ్రి ఎదుర్కొన్న పరిస్థితిని వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. 'మా నాన్న యూనిఫాం రక్తంతో తడిసిపోయింది' అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళనల సమయంలో ఆయన తలకు తీవ్ర గాయమైందని, నాలుగు కుట్లు కూడా పడినట్లు చెప్పుకొచ్చారు. తన తండ్రిని ఆ పరిస్థితుల్లో చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యానని వాపోయారు. నిరసనల సమయంలో గుంపులో కొందరు అసాంఘిక శక్తులు కలిసిపోయి మూకుమ్మడిగా రాళ్ల దాడికి దిగారని తన తండ్రి చెప్పినట్లు కుమారుడు వివరించారు. పోలీసులు స్పందించే అవకాశం లేకుండా వరుస దాడులు జరిగాయని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది.. నిరసనకారుల దాడులకు గురయ్యారని, గాయపడిన వారికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ప్రజల రక్షణ కోసం పనిచేసే పోలీసులపై దాడులను సహించరాదని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నేను దిల్లీ యూనివర్సిటీలో చదువుతున్నా. మా నాన్న 15 ఏళ్ల పాటు నేవీలో మెరైన్ కమాండోగా సేవలందించారు. ఇప్పుడు దిల్లీ పోలీసు విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థుల ఆందోళనల సమయంలో నాన్న ప్రధాన వేదిక అయిన జంతర్ మంతర్ వద్ద విధులు నిర్వహించారు. ప్రతి రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత.. నిరసనల గురించి మాకు చెప్పేవారు. విద్యార్థుల ముసుగులో కొంతమంది సంఘ విద్రోహ శక్తులు ఆందోళనల్లో చేరారని అన్నారు. ఆందోళనల సమయంలో మా నాన్నను కొంతమంది లాగి.. మూక దాడికి యత్నించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఆసుపత్రికి తరలించారు. దాదాపు నాలుగు గంటల పాటు నాన్న స్పృహలో లేరు. ఇంటికి తీసుకొచ్చేటప్పుడు ఆయన యూనిఫామ్ అంతా రక్తంతో తడిసిపోయింది. అలాంటి రోజు మా జీవితంలో ఎన్నడూ చూడలేదు. ఈ ఘటన తర్వాత నేను సోషల్ మీడియా తెరవగా.. మా నాన్ననే నేరస్థుడిగా నిందిస్తున్నారు. ఆయనపై దాడి చేసిన వారే.. న్యాయం కావాలంటూ సుప్రీంకోర్టు ను ఆశ్రయించారు. అప్పుడే నిర్ణయించుకున్నా.. మాకూ న్యాయం జరగాల్సిందే. అందుకే గాయపడిన పోలీసుల కుటుంబాలతో కలిసి సుప్రీంలో పిటిషన్ వేశాం అని ఓ ఎస్సై కుమార్తె మీడియా ముందు తన ఆవేదనను పంచుకున్నారు. నా భర్త దిల్లీ పోలీసు విభాగంలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్. 33 ఏళ్లుగా పోలీసు శాఖలో ఉన్నారు. ఆందోళనల సమయంలో ఆయనపై కొంతమంది దాడికి పాల్పడ్డారు. రాళ్లు, చెప్పులు.. ఏది దొరికితే దాంతో కొట్టారని ఆయన చెప్పారు. రాళ్ల దాడికి ఆయన పెట్టుకున్న హెల్మెట్ విరిగిపోయింది. ఈ నిరసనల తర్వాత ఎక్కడ చూసినా.. ఆందోళనకారులను పోలీసులు కొట్టారనే వార్తలే కన్పిస్తున్నాయి. కానీ, నాణెనికి మరోవైపు కూడా ఉంది. దాన్ని ఎవరూ పట్టించుకోవట్లేదు. ప్రజల కోసం సేవలందిస్తున్న వారి ఆవేదనను దేశమంతా వినాలని ఓ అసిస్టెంట్ ఎస్సై భార్య సీమా భావోద్వేగానికి గురయ్యారు. మా తాత బీఎస్ఎఫ్‌లో పని చేశారు. 1971 యుద్ధంలో పాల్గొన్నారు. ఆయన స్ఫూర్తితోనే నాన్న పోలీసు శాఖలో చేరి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తు న్నారు. ఆందోళనల సమయంలో బారికేడ్ల వద్ద విధులు నిర్వహిం చారు. ఉన్నట్టుండి తమపై ఆందోళనకారులు రాళ్లు విసిరారని నాన్న చెప్పారు. సీనియర్ అధికారులను రక్షించే క్రమంలో ఆయన తలకు తీవ్ర గాయమైంది. నాలుగు కుట్లు పడ్డాయ్. నేనూ విద్యార్థినే. విద్యార్థుల పట్ల నాన్న ఎప్పుడూ దురుసుగా ప్రవర్తించరు. ఈ నిరసనల్లో రౌడీలు, సంఘ విద్రోహ శక్తులు ఉన్నారని మరో పోలీసు కుమారుడు మీడియాకు తెలిపారు.

## విదేశీ విద్యార్థులపై ఫీజుల పిడుగు



- లక్ష డాలర్ల ఫీజుపై ట్రంప్ కసరత్తు

న్యూయార్క్,జులై31 : అంతర్జాతీయ విద్యార్థుల నుంచి ట్రంప్ సర్కారు లక్ష డాలర్ల ఫీజు వసూల్ చేసే ప్రణాళిక వేసింది. అమెరికా వర్సిటీల్లో విద్యాభ్యాసం పూర్తి చేసిన తర్వాత అక్కడే పని చేయాలను కుంటున్న స్టూడెంట్స్ నుంచి లక్ష డాలర్లు వసూల్ చేసే ఆలోచనలో ట్రంప్ సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది. వాల్ స్ట్రీట్ జర్నల్ దీనిపై కథనాన్ని రాసింది. హెచ్1-బీ వీసాదారుల నుంచి లక్ష డాలర్ల ఫీజు వసూల్ చేయాలన్న ప్రతిపాదనను అమెరికా కోర్టు కొట్టివేయడంతో.. ట్రంప్ సర్కారు కొత్త మార్గాన్ని అన్వేషిస్తున్నది. విద్యార్థులకు ఇచ్చే ఎఫ్-1 వీసాలకు ఎక్స్‌టెన్షన్‌గా భావించే ఆప్టికల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ వీసాలపై అధిక ఫీజును వసూల్ చేయాలని ఆ దేశ హోంశాఖ భావిస్తున్నట్లు ద వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో వెల్లడించింది. ఓపీటీ ప్రోగ్రామ్ ప్రకారం విదేశీ విద్యార్థులు తాము విద్యను పూర్తి చేసుకున్న ప్రాంతంలో సుమారు మూడేళ్ల వరకు పనిచేసే అవకాశం ఉంటుంది. 2024 నాటి రికార్డుల ప్రకారం సుమారు 4 లక్షల 19వేల విదేశీ విద్యార్థులు ఓపీటీ స్కీమ్ కింద అమెరికాలో పనిచేస్తున్నట్లు తెలిసింది. హెచ్1-బీ వీసాదారులపై లక్ష డాలర్ల ఫీజును వసూల్ చేయడాన్ని అమెరికాలోని టెకీ కంపెనీలు వ్యతిరేకించాయి. అమెరికా వర్సిటీల్లో చదివే విద్యార్థులకు ఆ కంపెనీలే ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటాయి.

## ప్రధాని మోడీ వీడియో మార్ఫింగ్

- మెటాపై సైబర్ క్రైమ్ పోలీసుల కేసు
- పులువురు సోషల్ మీడియా యూజర్లపైనా కేసు




హైదరాబాద్,జులై31 : భారత ప్రభుత్వం, ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' మధ్య కొనసాగుతున్న వివాదం మరింత ముదిరింది. కేంద్ర మంత్రిత్వ శాఖ గురువారం మెటాకు మరోసారి నోటీసులు జారీ చేయగా, తాజాగా హైదరాబాద్ పోలీసులు కూడా రంగంలోకి దిగారు. మెటా ఇండియా హెడ్ అరుణ్ శ్రీనివాస్‌తో పాటు పలువురు సోషల్ మీడియా యూజర్లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోడీకి సంబంధించిన ఓ వీడియోను ఎఐ సాంకేతికతతో మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో వ్యాప్తి చేసినట్లు ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నారు. సీజేపీ నిరసన సమయంలో ప్రధాని మోడీ షేర్ చేసిన వీడియోను కొందరు ఎఐ సహాయంతో ఎడిట్ చేసి, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేశారని పోలీసులు తెలిపారు. మెటా యాజమాన్యంలోని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లలో ఈ మార్ఫింగ్ వీడియోలు వైరల్ అయినట్లు విచారణలో తేలింది. ఈ విజువల్స్ ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, నూతన భారతీయ న్యాయ సంహిత , ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. ఈ డీప్‌ఫేక్ వీడియోలను ఎవరు సృష్టించారు? సోషల్ మీడియాలో ఇవి అంత విస్తృతంగా ఎలా వ్యాపించాయి? ఎలాట్‌ఫామ్స్ వద్ద ఉన్న భద్రతా చర్యలు వీటిని అడ్డుకోవడంలో సరిపోలేదా? అనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు సమగ్ర విచారణ జరుపుతున్నారు. వీటిని రూపొందించి, షేర్ చేసిన ప్రతి ఒక్కరి పాత్రపై ఆరా తీస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మెటా ప్రతినిధులను పిలిపించి, ఎలాట్‌ఫామ్‌లలో ౦ఎ స్కామ్‌లు, నకిలీ ప్రకటనలు, మార్ఫింగ్ కంటెంట్‌ను గుర్తించి తొలగించే పక్రియపై వివరణ కోరారు. దీనిపై స్పందించిన మెటా ప్రతినిధులు అధికారుల ముందు హాజరై, తమ వద్ద ఉన్న కంటెంట్ మోడరేషన్ విధానాలు, నిబంధనల వివరాలను సమర్పించారు. ప్రస్తుతం ఈ విచారణ ప్రాథమిక దశలోనే ఉందని పోలీసులు స్పష్టం చేశారు. డిజిటల్ ఆధారాల ప్రకారమే అన్ని ఆరోపణ లను పరిశీలిస్తామని, ప్రస్తుతం ఎవరిపై నేరం రుజువు కాలేదని, దర్యాప్తు ఫలితాల ఆధారంగానే తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

## అమెరికా మార్కెట్ చరిత్రలో మైక్రోసాఫ్ట్ రికార్డు

- 450 బిలియన్ డాలర్లు పెరిగిన మార్కెట్ విలువ



న్యూయార్క్,జులై31 : అమెరికా మార్కెట్ చరిత్రలోనే మునుపెన్నడూ లేని ఒక అద్భుతమైన రికార్డు నమోదైంది. టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఏకంగా ఒక్క రోజులోనే తన మార్కెట్ విలువకు దాదాపు 450 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.39 లక్షల కోట్లు పెంచుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది.వాల్ స్ట్రీట్ ట్రేడింగ్ చరిత్రలో ఏ ఒక్క నమోదిత కంపెనీ కూడా ఒక్క రోజు ఈ స్థాయిలో మార్కెట్ విలువను పెంచుకోలేదు. ఈ సంచలన ర్యాలీతో మైక్రోసాఫ్ట్.. ప్రముఖ ఏఐ చిప్‌మేకర్ 'ఎన్విడియా' ను వెనక్కి నెట్టి ప్రపంచంలోనే అత్యంత విలువైన పబ్లిక్ లిస్టెడ్ కంపెనీగా మళ్లీ తన స్థానాన్ని కైవసం చేసుకుంది. త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి తర్వాత మైక్రోసాఫ్ట్ షేర్లు ఒక్కసారిగా 9 శాతం పెరిగాయి. ఫలితంగా ఒక్క రోజులోనే పొందిన ఈ అదనపు మార్కెట్ విలువ, దక్షిణాఫ్రికా, వియత్నాం, టర్కీ వంటి దేశాల మొత్తం స్టాక్ మార్కెట్ విలువల కంటే చాలా పెద్దది కావడం విశేషం. ఈ చరిత్రాత్మక ర్యాలీ వెనుక ఉన్న ప్రధాన కారణం మైక్రోసాఫ్ట్‌కు చెందిన 'అజూర్' క్లౌడ్ బిజినెస్. విశ్లేషకులు ఊహించిన దానికంటే అజూర్ క్లౌడ్ ఆదాయం మెరుగైన వృద్ధిని కనబరిచింది. గత కొద్ది కాలంగా మైక్రోసాఫ్ట్ ఏఐ మౌలిక వసతులు, డేటా సెంటర్లు, చిప్‌లపై బిలియన్ల కొద్దీ డాలర్లను గుమ్మరిస్తోంది. ఈ భారీ పెట్టుబడులు నిజంగానే లాభాలను తెచ్చిపెడతాయా అనే సందేహాలకు ఈ ఆర్థిక ఫలితాలు స్పష్టమైన సానుకూల సమాధానాన్ని ఇచ్చాయి. రాబోయే త్రైమాసికంలో కూడా ఏఐ-ఆధారిత క్లౌడ్ సేవల డిమాండ్ బలంగా ఉంటుందని కంపెనీ వేసిన అంచనాలు నిజమయ్యాయి. గత కొన్ని నెలలుగా.. టెక్ కంపెనీలు ఏఐ కోసం చేస్తున్న ఖర్చులను తగ్గించుకుంటాయేమోనని ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొంది. అయితే మైక్రోసాఫ్ట్ సాధించిన ఈ విజయం ఆ అనుమానాలను పటాపంచలు చేసింది. కార్పొరేట్ ప్రపంచం ఏఐ సేవలకు భారీగా ఆర్డర్లు ఇస్తోందని, ఆ డిమాండ్‌ను అందుకోగల క్లౌడ్ సంస్థలకు ఇది బంగారు అవకాశమని నిరూపితమైంది. మైక్రోసాఫ్ట్ సాధించిన ఈ రికార్డు వృద్ధి.. ఎన్విడియా, అమెజాన్, ఆల్ఫాబెట్ (గూగుల్) వంటి ఇతర ఏఐ ఆధారిత దిగ్గజాలపై కూడా మార్కెట్ విశ్వాసాన్ని రెట్టింపు చేసింది.

## స్వేచ్ఛ అంటే ఇష్టం వచ్చినట్లు చేయడం కాదు

- సమాజం, దేశం పట్ల బాధ్యతలు కూడా ముఖ్యమే
- చట్టాన్ని గౌరవించడం పౌరుల ప్రాథమిక విధి
- జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సంచలన వ్యాఖ్య
- దోవల్‌కు అమిత్ షా చేతుల మీదుగా తిలక్ జాతీయ పురస్కారం అందచేత




ముంబై,ఆగస్ట్1 : ఇటీవల దేశంలో యువత చేపట్టిన నిరసనలపై జాతీయ భద్రతా సలహాదారు, ఇండియన్ జేమ్స్ బాండ్ అజిత్ దోవల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛ అంటే ఇష్టమొచ్చింది చేయడం కాదని యువతకు చురకలటించారు. స్వేచ్ఛతో పాటు సమాజం, దేశం పట్ల బాధ్యతలు కూడా ఉంటాయని యువత గుర్తుంచుకోవాలని హితవు పలికారు. స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కు చట్టబద్ధమైన పరిధిలోనే ఉండాలని నొక్కి చెప్పారు. ప్రజాస్వామ్యంలో శాంతిభద్రతలను కాపాడటం, చట్టాన్ని గౌరవించడం పౌరుల ప్రాథమిక విధి అని గుర్తు చేశారు. స్వేచ్ఛను ఇష్టానుసారంగా ఏమైనా చేసే అనియంత్రిత హక్కుగా భావించవద్దని యువతను హెచ్చరించారు. దేశ భద్రత, ఇంటెలిజెన్స్ రంగాలలో చేసిన అసమాన సేవలకు గాను అజిత్ దోవల్ ప్రతిష్టాత్మక లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం మహారాష్ట్రలోని పుణెలో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా దోవల్ ఈ అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు లోక్‌మాన్య బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్ట్ ఈ పురస్కారాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఉద్యమకారులు చేసిన త్యాగాలను యువ భారతీయులు స్మరించుకోవాలని సూచించారు. భారతదేశ జాతీయ చైతన్యాన్ని తీర్చిదిద్దడంలో తిలక్ పోషించిన పాత్ర.. ఆయన జీవితం నుంచి యువతరం స్ఫూర్తి పొందాలని కోరారు. నీట్ యూజీ 2026 క్వశ్చన్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువత పెద్ద ఎత్తున నిరసనలు తెలిపిన విషయం తెలిసిందే. నీట్ పేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చలో పార్లమెంట్?కు పిలుపునిచ్చింది. అఅయితే, ఈ చలో పార్లమెంట్ కార్యక్రమం తీవ్ర హింసాత్మకంగా మారింది. యువత నిరసనలను అణిచివేసేందుకు పోలీసులు దమనకాండ కొనసాగించారు. యువతపై లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్, పె÷-లలెట్ గన్స్ ఉపయోగించారు. కొన్ని చోట్ల పోలీసుల బలప్రయోగంపై యువత తిరగబడ్డారు. దీంతో సీజేపీ తలపెట్టిన చలో పార్లమెంట్ తీవ్ర హింసాత్మకంగా మారింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతిపక్షాలు కూడా విద్యార్థుల దాడిని తీవ్రంగా ఖండించాయి. యువత, ప్రతిపక్షాల నుంచి ఒత్తిడి పెరగడంతో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మరో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తాత్కాలికంగా విద్యాశాఖ బాధ్యతలు చేపట్టారు.

# సుంకాల హెచ్చరికతో భారత్–పాకిస్థాన్ యుద్ధాన్ని ఆపా



**మరోసారి అదే వ్యాఖ్యలు**

బలగం టీవీ, హైదరాబాద్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన ఘర్షణను తానే నిలిపివేశానని పేర్కొన్నారు. భారీ సుంకాలు విధిస్తానని హెచ్చరించిన తర్వాతే ఇరు దేశాలు యుద్ధం చేయబోమని తనకు తెలిపాయని అన్నారు.

అమెరికాలోని క్యాంప్ డేవిడ్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన, భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన ఘర్షణలో 11 యుద్ధ విమానాలు కూల్చివేయబడ్డాయని మరోసారి చెప్పారు. అయితే ఈ వ్యాఖ్యను భారత్ ఇప్పటికే ఖండించింది.

"భారత్, పాకిస్థాన్ రెండూ తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయి. యుద్ధం కొనసాగిస్తే 250 శాతం సుంకాలు విధిస్తానని హెచ్చరించాను. ఆ తర్వాతి రోజే ఇరు దేశాలు ఫోన్ చేసి యుద్ధం చేయబోమని చెప్పాయి" అని ట్రంప్ తెలిపారు.

పాకిస్థాన్ ప్రధానమంత్రి తన వల్లే కోట్లాది మంది ప్రాణాలు కాపాడబడ్డాయని చెప్పినట్లు కూడా ట్రంప్ పేర్కొన్నారు.

అయితే ఈ వ్యాఖ్యలను భారత్ మరోసారి తోసిపుచ్చింది. ఆపరేషన్ సింధూర్ సందర్భంగా కాల్పుల విరమణ పూర్తిగా ఇరు దేశాల సైనికాధికారుల మధ్య జరిగిన చర్చల ద్వారానే జరిగిందని, ఇందులో ఏ మూడో దేశం పాత్ర లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా మే 7న భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టి పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు నిర్వహించింది. అనంతరం పాకిస్థాన్ సైనికాధికారుల విజ్ఞప్తి మేరకు మే 10న సైనిక చర్యలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు భారత్ వెల్లడించింది.

# ‘కొలీజియం తీర్మానాలు కాపీ-పేస్ట్‌లా ఉన్నాయి’

**సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ సంచలన వ్యాఖ్యలు**

**న్యాయమూర్తుల నియామకాల్లో పారదర్శకత లోపిస్తే రాజ్యాంగ విరుద్ధ శక్తులు వ్యవస్థలోకి వస్తాయి!**

**లీగల్ థింక్ ట్యాంక్ చర్చా వేదికగా కొలీజియం శైలిపై సుప్రీం జడ్జి తీవ్ర అసంతృప్తి**

బలగం టీవీ, హైదరాబాద్

న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో అత్యంత పారదర్శకత తప్పనిసరి అని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ స్పష్టం చేశారు. కొలీజియం చేసే సిఫారసులకు తగిన కారణాలను వెల్లడించకపోవడం వల్ల అర్హత కలిగిన జడ్జిల సేవలకు తగిన గుర్తింపు లభించకపోవడమే కాకుండా తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా వ్యవహరించే శక్తులు కూడా న్యాయవ్యవస్థలోకి ప్రవేశించే ప్రమాదం ఉందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. లీగల్ థింక్ ట్యాంక్ 'విధి'కి చెందిన JALDI ఇనిషియేటివ్ రూపొందించిన ఒక రిపోర్ట్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ భుయాన్, కొలీజియం పనితీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు.

"గడిచిన మూడు కొలీజియాల తీర్మానాలను నేను నిశితంగా గమనించా. అందులో నియామకాలకు సంబంధించి ఎలాంటి కారణాలూ వెల్లడించలేదు. ఇది పారదర్శకత సూత్రం నుంచి వెనక్కి తగ్గడం కాదా? కొలీజియం తీర్మానాలు ఇప్పుడు చూస్తుంటే ఒకే మూస పద్ధతిలో, కాపీ-పేస్ట్ చేసినట్లుగా కనిపిస్తున్నాయి."

— జస్టిస్ ఉజ్జల్ భుయాన్, సుప్రీం కోర్టు న్యాయమూర్తి

కారణాలు దాచడం.. నిజాయతీ గల జడ్జిలకు ద్రోహమే!

కారణాలు చెప్పకుండా రహస్యంగా నియామకాలు చేపట్టడం వల్ల అనర్హులు లేదా వివాదాస్పద వ్యాఖ్యలు చేసే వ్యక్తులు న్యాయమూర్తులుగా ఎంపికయ్యే ప్రమాదం ఉందని జస్టిస్ భుయాన్ హెచ్చరించారు. "ఎవరిని ఎందుకు సిఫార్సు చేస్తున్నామో స్పష్టంగా తెలియాలి. కారణాలు దాచడం ద్వారా కొలీజియం అద్భుతంగా పనిచేసే నిజాయతీ గల జడ్జిలకు ద్రోహం చేయడమే కాకుండా, న్యాయ వ్యవస్థలోకి అనుచిత వ్యక్తులు వచ్చేందుకు స్థానం కల్పిస్తోంది. అటువంటి వారు రేపటి రోజున వ్యవస్థలోకి వచ్చి ఒక వర్గం ప్రజల్ని 'చీమలు' అని సంబోధిస్తూ రాజ్యాంగ విలువలకు పూర్తి విరుద్ధమైన వ్యాఖ్యలు చేసే అవకాశం ఉంది" అని ఉదహరించారు. న్యాయవ్యవస్థలోకి అలాంటి వ్యక్తులు రాకుండా అడ్డుకోవాలంటే, ఎవరిని ఎందుకు ఎంపిక చేస్తున్నామో, ఎందుకు తిరస్కరిస్తున్నామో తెలిపేలా సరైన చర్చలు జరగాలని, కారణాల్ని కూడా బహిరంగంగా వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో కనీసం సిఫార్సులకు కారణాలైనా వెల్లడించేవారని, ఇప్పుడు ఆ సంప్రదాయం అసలు కనిపించడం లేదని వ్యాఖ్యానించారు.

పాత వివాదాల పరోక్ష ప్రస్తావన?



జస్టిస్ ఉజ్జల్ భుయాన్ తన ప్రసంగంలో నేరుగా ఎవరి పేరునూ ప్రస్తావించలేదు. అయితే 2024లో విశ్వ హిందూ పరిషత్ కార్యక్రమంలో పాల్గొని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అలహాబాద్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఉదంతాన్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించినట్లు భావిస్తున్నారు. అప్పట్లో ఆ జడ్జి మాట్లాడుతూ.. "మన సంస్కృతిలో చిన్న చిన్న జంతువులకు కూడా హాని చేయకూడదని, చీమలను కూడా చంపకూడదని నేర్పుతారు. కానీ మీ సంస్కృతిలో చిన్నప్పటి నుంచే జంతువుల వధను చూస్తారు. మీలో సహనం, కరుణ ఎలా ఆశించగలం" అంటూ చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి.

[బాక్స్ ఐటమ్ 2] వివాదాలకు దారితీస్తున్న వ్యాఖ్యలు.. సీజేఐ స్పష్టత

మరోవైపు ఇటీవల భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) జస్టిస్ సూర్యకాంత్ కూడా ఒక సందర్భంలో కొందరిని 'కాక్రోచ్ (బొద్దింకలు)' అని వర్ణించడం వివాదాస్పదమైంది. దానికి నిరసనగా సోషల్ మీడియాలో 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో NEET పేపర్ లీక్ అంశంపై పెద్ద ఎత్తున విద్యార్థుల నిరసన ఉద్యమం చెలరేగడం, ఈ క్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయడం సంచలనం సృష్టించింది.

అయితే కొలీజియం వ్యవస్థలపై వచ్చే విమర్శలపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ గతంలో స్పందిస్తూ స్పష్టత ఇచ్చారు. సుప్రీం కోర్టుకు లేదా హైకోర్టులకు న్యాయమూర్తుల్ని సిఫార్సు చేసే సమయంలో వారి పనితీరు, న్యాయమూర్తిగా అందించిన సుదీర్ఘ సేవలు, గతంలో వారు నిర్వహించిన బాధ్యతల్ని, వృత్తిపరమైన అనుభవం వంటి అనేక అంశాల్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కొలీజియం తుది నిర్ణయం తీసుకుంటుందని ఆయన వివరించారు.

# సాయి చెంత భక్తజన సంద్రం.. మూడు రోజుల్లో రూ.7.81 కోట్ల విరాళాలు!




**ఉత్సవాలకు అఖండ స్పందన..**

**సాయి చరణాలకు భక్తుల గురుదక్షిణ**

**గత ఏడాది కంటే రూ.1.5 కోట్ల ఆదాయం పెరుగుదల..**

**వెల్లడించిన సంస్థాన్ సీఈఓ గోరక్ష గదిల్కర్**

బలగం టీవీ, హైదరాబాద్

ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం షిర్డీలో శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ నిర్వహించిన శ్రీ గురు పౌర్ణమి ఉత్సవాలకు ఈ ఏడాది కూడా దేశ, విదేశాల నుంచి సాయి భక్తుల నుంచి అఖండ స్పందన లభించింది. సాయిబాబాను తమ గురువుగా భావించే లక్షలాది మంది భక్తులు సాయి సమాధిని దర్శించుకుని, తమ గురుదక్షిణగా ఉదారంగా విరాళాలు సమర్పించారు. గురు పౌర్ణమి ఉత్సవాల కేవలం మూడు రోజుల్లోనే సంస్థకు రికార్డు స్థాయిలో రూ.7,81,13,000 విరాళాల రూపంలో అందాయి. గత ఏడాది రికార్డును ఈ ఏడాది అధిగమించడంతో పాటు దాదాపు 1.5 కోట్ల రూపాయల పెరుగుదల నమోదైందని సంస్థాన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) గోరక్ష గదిల్కర్ అధికారికంగా తెలిపారు.

మూడ్రోజుల్లో మూడు లక్షల మందికి పైగా దర్శనం

సాయిబాబా సంస్థాన్ ఆధ్వర్యంలో 2026 జులై 28 నుంచి జులై 30 వరకు మూడు రోజుల పాటు గురు పౌర్ణమి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల సందర్భంగా మూడు లక్షలకు పైగా సాయి భక్తులు బాబా సమాధిని సందర్శించి పునీతులయ్యారు. భక్తులు సమర్పించిన విరాళాల వివరాలను అధికారులు వెల్లడించారు. అందులో హుండీ (దక్షిణ పెట్టి) ద్వారా నగదు రూపంలో రూ.2,04,35,557 లభించగా, విరాళాల కౌంటర్ల వద్ద రూ.1,25,47,935 భక్తులు చెల్లించారు. పీఆర్ఓ కార్యాలయం ద్వారా రూ.87,14,000 అందాయి. ఆన్‌లైన్, డెబిట్-క్రెడిట్ కార్డులు, చెక్కులు, డీడీలు, మనీ ఆర్డర్ల ద్వారా సంస్థకు రూ.2,77,84,701 రాగా, విదేశీ భక్తుల నుంచి కరెన్సీ రూపంలో రూ.5,65,991 విరాళంగా సమకూరాయి.

డబ్బుతో పాటు భారీగా సమర్పించిన బంగారం, వెండి ఆభరణాలు.. పెరిగిన భక్తుల విరాళాల పరంపర!

కిలోకు పైగా బంగారం సమర్పణ

భక్తులు కేవలం నగదు రూపంలోనే కాకుండా బాబాపై ఉన్న భక్తితో పెద్ద మొత్తంలో ముడుపుల రూపంలో బంగారం, వెండి ఆభరణాలను సమర్పించారు. ఉత్సవాల కాలంలో రూ.1,46,74,544 విలువైన 1,125.570 గ్రాముల (సుమారు 1.12 కిలోలు) బంగారం లభించిందని సీఈఓ గోరక్ష్ గదిల్కర్ తెలిపారు. అలాగే రూ.3,90,649 విలువైన 2,376.500 గ్రాముల వెండి కూడా బాబా పాదాల చెంతకు చేరిందని ఆయన వివరించారు.

అన్నప్రసాద వితరణ.. లడ్డూల ద్వారా ఆదాయం

ఉత్సవాల సందర్భంగా షిర్డీకి వచ్చిన భక్తుల కోసం సంస్థాన్ భారీగా ప్రసాద వితరణ కార్యక్రమాలను చేపట్టింది.

ప్రసాదాలయంలో భోజనం: మూడు రోజుల్లో శ్రీ సాయిబాబా ప్రసాదాలయంలో 1,94,285 మంది సాయి భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

అన్నప్రసాద ప్యాకెట్లు: ప్రసాదాలయానికి రాలేని వారి కోసం 39,611 అన్న ప్రసాద ప్యాకెట్లను పంపిణీ చేశారు.

ఉచిత బూందీ ప్రసాదం: సాయి దర్శనం కోసం గంటల తరబడి వరుసలో వేచి ఉన్న 1,65,200 మంది భక్తులకు ఉచితంగా బూందీ ప్రసాద ప్యాకెట్లను అందజేశారు.

లడ్డూల అమ్మకం: భక్తులు డబ్బు చెల్లించి కొనుగోలు చేసిన ప్రసాద లడ్డు ప్యాకెట్ల అమ్మకం ద్వారా సంస్థకు రూ.71,17,360 ఆదాయం సమకూరింది.

గత ఏడాదితో పోలిస్తే పెరిగిన ఆదాయం

గత ఏడాది గురు పౌర్ణమి ఉత్సవంలో కూడా మూడు లక్షల మంది భక్తులు సాయి సమాధిని దర్శించుకోగా, ఆ సమయంలో రూ.6,31,31,000 విలువైన విరాళాలు అందాయి. అయితే ఈ సంవత్సరం భక్తుల నుంచి మరింత ఉదారత కనిపించింది. ఈసారి మూడు రోజుల ఉత్సవంలో ఏకంగా రూ.7,81,13,000 విరాళాలు వచ్చాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి విరాళాల్లో రూ.1.5 కోట్ల స్పష్టమైన పెరుగుదల నమోదైందని సంస్థాన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి గోరక్ష గడిల్కర్ హర్షం వ్యక్తం చేశారు.

# 31లోగా టీచర్ల సమస్యలు తీర్చకుంటే అసెంబ్లీ, సచివాలయం ముట్టడి!’

**కాంగ్రెస్ సర్కార్‌కు ‘తపస్’ బహిరంగ అల్టిమేటం..**

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను ఈ నెల 31వ తేదీలోగా తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర ప్రభుత్వానికి గడువు విధిస్తూ అల్టిమేటం జారీచేసింది. ఒకవేళ ప్రభుత్వం నిర్దేశిత గడువులోపు తమ సమస్యలను పరిష్కరించకుంటే, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది ఉపాధ్యాయులను సమీకరించి సచివాలయం (సెక్రటేరియట్), అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రతిజ్ఞ చేసింది. ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చాలన్న ప్రధాన లక్ష్యంతో ‘తపస్’ శనివారం భాగ్యనగరంలో నిర్వహించిన ‘చలో హైదరాబాద్’ మహాధర్నా కార్యక్రమం విజయవంతమైంది.

ఈ ధర్నాను ఉద్దేశించి తపస్ రాష్ట్ర అధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్యలు మాట్లాడుతూ.. తాము ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొత్త డిమాండ్లను ఏమీ తెరపైకి తీసుకురావడం లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను, అలాగే న్యాయంగా తమకు అందాల్సిన డీఏలు (కరువు భత్యం), పీఆర్సీ (వేతన సవరణ)లను మాత్రమే అమలు చేయాలని కోరుతున్నామని వారు వివరించారు.

**"గడువులోగా సమస్యలు పరిష్కరించకపోతే వేల మంది టీచర్లతో సచివాలయాన్ని, అసెంబ్లీని ముట్టడిస్తాం!" —తపస్ ఉపాధ్యాయ సంఘం నేతలు**




హైదరాబాద్‌లో జరిగిన ఈ ఉపాధ్యాయుల చలో హైదరాబాద్ ధర్నా కార్యక్రమానికి ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు భారీగా తరలివచ్చి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

మద్దతు తెలిపిన ప్రముఖులు: రాజ్యసభ సభ్యుడు (ఎంపీ) డాక్టర్ కే లక్ష్మణ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఈ పోరాటానికి సంఘీభావం తెలిపారు.

మండలి పక్షనేతల మద్దతు: శాసనమండలి (మండలి) పక్షనేత డాక్టర్ ఏవీఎన్ రెడ్డితో పాటు ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమురయ్య తదితరులు ధర్నాలో స్వయంగా పాల్గొని ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేరే వరకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



## కారాకోరం శ్రేణిలో భారీ హిమపాతం..

**ప్రపంచ ప్రసిద్ధ పర్వతారోహకుడు నిర్మల్ పుర్జా దుర్మరణం!**

**పాకిస్థాన్‌లోని ‘బ్రాడ్ పీక్’ శిఖరాన్ని అధిరోహిస్తుండగా విరుచుకుపడ్డ మంచు తుఫాను**

**పుర్జాతో పాటు పలువురు అంతర్జాతీయ పర్వతారోహకులు బలి.. విషాదంలో క్రీడా ప్రపంచం**

బలగం టీవీ, హైదరాబాద్

ప్రపంచ పర్వతారోహణ రంగంలో ఎన్నో అసాధారణ రికార్డులను తన పేరిట లిఖించుకున్న బ్రిటిష్-నేపాలీ పర్వతారోహకుడు నిర్మల్ పుర్జా (43) ఇక లేరు. పాకిస్థాన్‌లోని అత్యంత ప్రమాదకరమైన ‘బ్రాడ్ పీక్’ పర్వతాన్ని అధిరోహించే క్రమంలో సంభవించిన భారీ హిమపాతంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఆయనతో పాటు యాత్రలో ఉన్న మరికొందరు అంతర్జాతీయ సభ్యులు కూడా ఈ ప్రమాదంలో మృతి చెందినట్లు నిర్మల్ పుర్జాకు చెందిన ‘ఎలైట్ ఎక్స్‌పెడిషన్స్’ సంస్థ సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ధ్రువీకరించింది.

గురువారం రోజున పాకిస్థాన్ ఉత్తర ప్రాంతంలోని కారాకోరం పర్వత శ్రేణిలో ఉన్న 8047 మీటర్ల ఎత్తయిన బ్రాడ్ పీక్ శిఖరాన్ని అధిరోహించే ప్రయత్నంలో ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సుమారు 6600 మీటర్ల ఎత్తులో ప్రయాణిస్తున్న 10 మంది సభ్యులతో కూడిన అంతర్జాతీయ బృందంపై ఒక్కసారిగా భారీ హిమపాతం విరుచుకుపడింది. దీంతో బృందంలోని సభ్యులందరితో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి.

ముగ్గురి మృతదేహాలు లభ్యం..

గిల్గిట్-బాల్టిస్తాన్ ప్రాంతీయ ప్రభుత్వ అధికారిక సమాచారం ప్రకారం.. శనివారం ఉదయం నిర్వహించిన డ్రోన్ సర్వేలో క్యాంప్-1 సమీపంలో ముగ్గురు పర్వతారోహకుల మృతదేహాలను సహాయక బృందాలు గుర్తించి వెలికితీశాయి. వారిలో అమెరికాకు చెందిన ఒక మహిళ, ఒమన్‌కు చెందిన మహిళతో పాటు నేపాల్‌కు చెందిన ఒక పురుషుడు ఉన్నట్లు తేలింది. ఈ మృతదేహాలను ఆర్మీ హెలికాప్టర్ ద్వారా ఆస్పత్రికి తరలించి అధికారిక గుర్తింపు ప్రక్రియను చేపట్టారు. అత్యంత దుర్భర వాతావరణం, భారీగా కురుస్తున్న మంచును సైతం లెక్కచేయకుండా పాకిస్థాన్ సైన్యం, స్థానిక హై ఆల్టిట్యూడ్ రెస్క్యూ బృందాలు మిగిలిన వారి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

"బ్రాడ్ పీక్ సురక్షితంగా ఎక్కి తిరిగి రావాలని మాత్రమే కోరుకుంటున్నాను" — నిర్మల్ పుర్జా తన చివరి సోషల్ మీడియా పోస్ట్‌లో పెట్టిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు అభిమానులకు విషాద జ్ఞాపకంగా మిగిలాయి.

త్రుటిలో తప్పించుకున్న ఫిదా అలీ..

ఈ అంతర్జాతీయ యాత్రలో నిర్మల్ పుర్జాతో పాటు ఐదుగురు నేపాలీలు, ఒక పాకిస్థానీ, ఒక ఒమానీ, ఒక అమెరికన్ మరియు ఒక చైనా పర్వతారోహకుడు ఉన్నారు. హిమపాతం ధాటికి సభ్యులంతా వందల మీటర్ల దూరం కొండ దిగువకు కొట్టుకుపోయినట్లు ట్రాకింగ్ పరికరాల ద్వారా తెలిసింది.

అయితే, ఈ ప్రమాదం నుంచి త్రుటిలో ప్రాణాలతో బయటపడిన బృంద సభ్యుడు ఫిదా అలీ మాట్లాడుతూ సంచలన విషయాలు వెల్లడించారు. "నేను కూడా పుర్జా బృందంలో భాగమే. కానీ, పైభాగంలో తీవ్రంగా అలసిపోయిన ఒక రష్యన్ పర్వతారోహకురాలిని సురక్షితంగా కిందికి తీసుకురావాల్సి రావడంతో నేను ముందే వెనుదిరిగాను. ఆ ఒక్క కారణం వల్లే నేను ఈ రోజు ప్రాణాలతో ఉన్నాను" అంటూ అలీ కన్నీటిపర్యంతమయ్యారు.

[బాక్స్ ఐటమ్ 1] ఆరు నెలల్లో 14 శిఖరాలు.. వరల్డ్ రికార్డ్!

నేపాల్‌లో జన్మించిన నిర్మల్ పుర్జా తొలుత బ్రిటన్ గుర్ఖా బ్రిగేడ్‌లో, ఆ తర్వాత రాయల్ మెరైన్స్ స్పెషల్ బోట్ స్క్వాడ్రన్‌లో సైనికుడిగా అసాధారణ సేవలు అందించారు. ఆ తర్వాత పర్వతారోహణను వృత్తిగా ఎంచుకుని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు.

చారిత్రక రికార్డు: 2019 ఏప్రిల్ - అక్టోబర్ మధ్య కేవలం 6 నెలల 6 రోజుల్లో ప్రపంచంలోని 8 వేల మీటర్ల కంటే ఎత్తయిన 14 శిఖరాలను అధిరోహించి ప్రపంచ రికార్డు సృష్టించారు.

చివరి ఆశయం: ఇటీవల ఎలాంటి కృత్రిమ ఆక్సిజన్ సిలిండర్లు ఉపయోగించకుండా, ప్రపంచంలోని 14 సూపర్ పీక్స్‌ను రెండోసారి అధిరోహించిన ప్రపంచపు తొలి వ్యక్తిగా నిలవాలనే మహోన్నత లక్ష్యంతో ఆయన ఈ ప్రమాదకర బ్రాడ్ పీక్ యాత్రను ప్రారంభించారు. కానీ విధి ఆడిన వింత నాటకంలో ఇదే ఆయనకు చివరి యాత్రగా మారింది.

## ‘సీఎం బ్లాక్‌మెయిలర్‌లా మారారు’

**ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం చేతగాకే విద్యార్థులను ‘క్రిమినల్ వేస్ట్’ అన్నారు**

**ఆయనకు అందరినీ కించపరచడం, బూతులు తిట్టడం తప్ప పాలన చేతకాదు: చిరుమళ్ల రాకేశ్‌కుమార్**




బలగం టీవీ, హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర పాలనను పూర్తిగా పక్కనబెట్టి, పక్కా బ్లాక్ మెయిలర్‌లా మారారని కార్పొరేషన్ మాజీ చైర్మన్ చిరుమళ్ల రాకేశ్‌కుమార్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. సమాజంలోని అన్నివర్గాలను బెదిరించి, తన దారికి తెచ్చుకోవాలని సీఎం చూస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు చెల్లించడం చేతగాకనే, రేవంత్‌రెడ్డి ఇంజినీరింగ్ విద్యార్థులను ‘క్రిమినల్ వేస్ట్’ అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. తన గురువు చంద్రబాబు బాటలోనే నడుస్తూ, తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎగ్గొట్టేందుకు సీఎం కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

ఇంజినీరింగ్ చదివి ఉన్నత స్థాయికి చేరిన ఐఏఎస్ అధికారుల సమక్షంలోనే, రాష్ట్ర భవిష్యత్ ఇంజినీర్లను ముఖ్యమంత్రి అలా అవమానించడం అత్యంత దుర్మార్గమని రాకేశ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. "వందల కోట్లు వెచ్చించి నిర్వహించిన అందాల పోటీలు, ఫుట్‌బాల్ మ్యాచ్‌లు క్రిమినల్ వేస్ట్ కావా? నీ హార్వర్డ్ విద్యకు వెచ్చించిన ప్రభుత్వ సొమ్ము వృథా కాదా?" అని ఆయన సీఎంను నిలదీశారు. సుసంపన్నమైన తెలంగాణ రాష్ట్రాన్ని క్యాన్సర్, ఎయిడ్స్ రోగులతో పోల్చిన దౌర్భాగ్యపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి ఇతరులను కించపరచడం, బూతులు తిట్టడం తప్ప రాష్ట్ర ప్రయోజనాల గురించి ఇంకేం చేతకాదని నిప్పులు చెరిగారు.

రాష్ట్రంలో తానే 70 వేల ఉద్యోగాలిచ్చానని రేవంత్‌రెడ్డి పదే పదే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని రాకేశ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో కేసీఆర్ హయాంలోనే భర్తీ ప్రక్రియ పూర్తయిన ఉద్యోగాలను కూడా ఇప్పుడు తన ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటని ఎద్దేవాచేశారు. ఉద్యోగాల భర్తీ విషయంలో కాంగ్రెస్ నాయకులు చెబుతున్న మాటలు నిజమైతే, తన సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించకుండా అన్ని వర్గాలను మోసం చేసిన ఈ కాంగ్రెస్ సర్కార్‌కు బుద్ధిచెప్పేందుకు ప్రజలు తగిన సమయం కోసం ఎదురుచూస్తున్నారని ఆయన హెచ్చరించారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

**బీజేపీ పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

**‘తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం’ ధర్నాలో గర్జించిన బీజేపీ నాయకులు**

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సుదీర్ఘ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల మహాధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన డీఏ (కరువు భత్యం) పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, కొత్త పీఆర్సీ (వేతన సవరణ కమిషన్)ని వెంటనే ప్రకటించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతున్న మాటలకు, ప్రభుత్వ పాఠశాలలకు కేటాయిస్తున్న నిధులకు ఎక్కడా పొంతన లేదని మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు పాఠశాలల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆయన విమర్శించారు. ఈ ధర్నాలో పాల్గొన్న గౌరవ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, మల్క కొమురయ్య, అంజిరెడ్డిలు మాట్లాడుతూ.. ప్రభుత్వ పెద్దలు ఉపాధ్యాయులను కించపరిచేలా మాట్లాడటం మానుకోవాలని, సమాజంలో వారి గౌరవాన్ని పెంచేలా ప్రభుత్వం వ్యవహరించాలని హితవు పలికారు.

విదేశీ విద్యా విధానాలపై ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలను మహేశ్వర్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. ఫిన్లాండ్, జర్మనీ దేశాల విద్యా వ్యవస్థల కంటే భారతదేశ విద్యా విధానం ఎంతో మెరుగ్గా ఉందనే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రహించాలని, వారిని చూసి మనం నేర్చుకోవాల్సిన అవసరం అస్సలు లేదని స్పష్టం చేశారు.

బదిలీల క్యాలెండర్: ఉపాధ్యాయులకు సంబంధించిన వార్షిక ప్రమోషన్లు, బదిలీల (ట్రాన్స్‌ఫర్స్) క్యాలెండర్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి.

317 జీవో సవరణ: గత ప్రభుత్వ హయాంలో వచ్చిన 317 జీవో వల్ల నష్టపోయిన బాధితులకు తక్షణమే పూర్తి న్యాయం చేయాలి.

జీవో 190 అమలు: ఉపాధ్యాయులకు లబ్ధి చేకూర్చే 190 జీవోను వెంటనే రాష్ట్రవ్యాప్తంగా అమలు పరచాలి.

సీపీఎస్ రద్దు: ఉపాధ్యాయులకు శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (CPS) విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి. హైదరాబాద్‌లో జరిగిన ఈ ఉపాధ్యాయుల ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయ లోకం నుంచి భారీ స్పందన లభించింది. ఉపాధ్యాయుల పోరాటానికి బీజేపీ పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) డాక్టర్ కే లక్ష్మణ్ కూడా పాల్గొని ఉపాధ్యాయుల డిమాండ్లకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

# ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ స్టేషన్ల హేతబద్దీకరణ..



**-ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ**

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం జిల్లాలో పోలింగ్ స్టేషన్ల హేతబద్దీకరణ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. పోలింగ్ స్టేషన్ల హేతబద్దీకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి కలెక్టర్ శనివారం సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల పరిధిలో మొత్తం 549 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు.

ఇందులో వేములవాడ నియోజకవర్గంలో 262, సిరిసిల్ల నియోజకవర్గంలో 287 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని,ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం 1200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లు లేవని తెలిపారు. ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 10వ తేదీ వరకు ఎన్నికల సంఘం పొడిగించిందని, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగంగా జరుగుతుందని, ఇప్పటికే జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ 87.42 శాతం పూర్తయిందని అన్నారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుందని, అదే రోజు నుంచి సెప్టెంబర్ 16వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నమని, క్లెయిమ్స్, అభ్యంతరాలపై నోటీసుల జారీ, పరిష్కార ప్రక్రియ ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు కొనసాగుతుందని, అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు.

ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదై ఉండరాదని, కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఫారం-6 ద్వారా, అదే నియోజకవర్గం లేదా ఇతర నియోజకవర్గానికి ఓటును బదిలీ (షిఫ్టింగ్) చేసుకోవాలనుకునే వారు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆగస్టు 17వ తేదీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ నుండి సెప్టెంబర్ 16వ తేదీ వరకు ఈ దరఖాస్తులను సమర్పించవచ్చని అన్నారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సహకారం అందించాలని అన్నారు. సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు శ్రీధర్ బాబు, కె.ఎస్.బి.కుమారి, పర్యవేక్షకులు ప్రవీణ్, ఎలక్షన్ విభాగం నాయబ్ తహసీల్దార్ రెహమాన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం..

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

హైకోర్టు న్యాయమూర్తి, రాజన్న సిరిసిల్ల పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ శ్రీ ఎన్ తుకారాంజీ కి జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి, జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి బి.పుష్పలత, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె శనివారం స్వాగతం పలికారు.జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయనకు సిరిసిల్ల పట్టణంలోని పంచాయతీ రాజ్ అతిథి గృహంలో పుష్పగుచ్ఛాలు అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సిరిసిల్ల, వేములవాడ సీనియర్ సివిల్ న్యాయమూర్తులు పి.లక్ష్మణాచారి, అజయ్ కుమార్ జాదవ్, సిరిసిల్ల జూనియర్ సివిల్ జడ్జి జి.మేఘన, ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీ నాగేంద్రచారి చారి, తహసీల్దార్ మహేష్, తదితరులు ఉన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు..

**- ఎస్పీ మహేష్ బి.గితే...**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :



*శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని *పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (ఆగస్ట్ 1వ తేది నుండి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ మహేష్ బి.గితే శని వారం ఓ ప్రకటన లో తెలిపారు. ఈ సందర్బంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు,రాస్తా రోకోలు,నిరసనలు,ర్యాలిలు,పబ్లిక్ మీటింగ్ లు,సభలు,సమావేశాలు నిర్వహించరదాని,నిబంధనలకు విరుద్దంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు.కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

# మై భారత్ జిల్లా సలహా కమిటీ సమావేశం..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ ఛాంబర్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ గడ్డం నగేష్ అధ్యక్షతన మై భారత్ (మేరా యువ భారత్ మై భారత్ సిరిసిల్ల) నమోదు డ్రైవ్‌కు సంబంధించి జిల్లా సలహా కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవిన్యూ గడ్డం నగేష్ మాట్లాడుతూ, జిల్లాలోని యువతకు మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా వివిధ జాతీయ, రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవా అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. జిల్లాలో నమోదు లక్ష్యాలను సాధించేందుకు మండల, గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.సమావేశంలో మై భారత్ జిల్లా కార్యక్రమ ఉమ్మడి జిల్లా అధికారి గోలి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం సిరిసిల్ల జిల్లాలో కొనసాగుతున్న మైభారత్ ఇంటెన్సివ్ నమోదు మరియు అవగాహన డ్రైవ్ జులై 1 నుండి ఆగస్టు 15 వరకు కొనసాగుతుందని, పాఠశాలలు, కళాశాలలు,క్రిడాకారులు యువజన సంఘాల, భాగస్వామ్యంతో ఈ డ్రైవ్‌ను మరింత ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి శ్రీనివాసాచారి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్,మైభారత్ జిల్లా కార్యక్రమ అధికారి జి.కిరణ్ కుమార్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.





## వాణినికేతన్ హైస్కూల్లో ఘనంగా పోచమ్మ బోనాలు

బలగం,టీవీ ఇల్లంతకుంట

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణి నికేతన్ హై స్కూల్లో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పోచమ్మ చిత్రపటం వద్ద శనివారం పూజలు నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులు ధరించి వచ్చిన విద్యార్థినిలు పోచమ్మ బోనాలు ఎత్తుకున్నారు.

డప్పు చప్పుళ్ళు, పోతరాజుల విన్యాసాల మధ్య బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పోచమ్మ ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాల పండుగను పాఠశాలలో నిర్వహించడం గర్వకారణం అన్నారు. పిల్లలకు చదువుతోపాటు సాంప్రదాయాలు, ఆచారాలపై అవగాహన కల్పించాలని లక్ష్యంతో కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. బోనాల పండుగ ఐక్యమత్యానికి, సంస్కృతికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తూముకుంట శ్రీనిధి, ఉపాధ్యాయనీలు సుమంగళి, శోభ, మహాలక్ష్మి, లావణ్య, సునంద, మౌనిక, కళ్యాణి, శమిమా, రేణుక, జలజ, శాంత, పద్మ, స్వాతి, రేణుక, సునీత, ఉష, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజు, సంతోష్, రమేష్, రాజు, తిరుపతి లతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు

# అనుమతులు లేని రెండు స్కానింగ్ సెంటర్లకు నోటీసులు..



**-వేములవాడలో ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలపై డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీలు**

బలగం టీవీ,వేములవాడ:

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ స్కానింగ్ సెంటర్లపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, చట్టపరమైన నిబంధనల అమలును పరిశీలించారు.

ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ ఆసుపత్రుల్లో రోగులకు అందించే సేవల రుసుముల పట్టికను ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు. అలాగే ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన సర్టిఫికెట్, కాలుష్య నియంత్రణ (పొల్యూషన్) సర్టిఫికెట్, ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల పేర్ల జాబితా, సిబ్బంది అర్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఫైర్ సేఫ్టీకి సంబంధించిన అన్ని భద్రతా పరికరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని యాజమాన్యాలకు సూచించారు.

డయాగ్నస్టిక్ స్కానింగ్ సెంటర్లలో గర్భిణులకు సేవలు అందించే సమయంలో పీసీపీఎన్‌డీటీ చట్టంలోని నిబంధనలను కచ్చితంగా పాటించాలని డీఎంహెచ్‌వో హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, పుట్టబోయే శిశువు లింగాన్ని వెల్లడించడం పూర్తిగా చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. స్కానింగ్ కేంద్రాల్లో అనుమతి పొందిన రేడియాలజిస్టులు లేదా గైనకాలజిస్టులు మాత్రమే గర్భిణులకు స్కానింగ్ నిర్వహించాలని ఆదేశించారు.

అలాగే ప్రతి స్కానింగ్ కేంద్రంలో స్కానింగ్ గది, వేచి ఉండే హాలులో "ఇక్కడ లింగ నిర్ధారణ చెప్పబడదు" అనే బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఫారం-ఎఫ్ వివరాలను అదే రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, ప్రతి నెల 5వ తేదీలోపు సంబంధిత రికార్డులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు.తనిఖీల సందర్భంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రెండు డయాగ్నస్టిక్ స్కానింగ్ సెంటర్లను గుర్తించిన అధికారులు, వాటి యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ హెచ్చరించారు.ఈ తనిఖీల్లో సెక్షన్ ఇన్‌చార్జి మహేష్‌తో పాటు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# జీవో 25ను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

**-పిఆర్సి వెంటనే ప్రకటించి, పెండింగ్ డి ఎ లు వెంటనే చెల్లించాలి..**

**-టి పి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలు ఎదురుచూస్తున్న పే రివిజన్ కమిషన్ నివేదికను వెంటనే అమలు చేస్తూ నూతన పి.ఆర్.సిని ప్రకటించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. శని వారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతా నగర్ హై స్కూల్ లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలల మూసివేతకు కారణమైన జీవో నంబర్ 25 ను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, వర్క్ అడ్జస్మెంట్ పేరుతో జరుగుతున్న అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఓవైపు విద్యార్థుల సంఖ్య పెంచాలని ఒత్తిడి చేస్తూ మరోవైపు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే శిక్షణల పేరుతో ఉపాధ్యాయులను పాఠశాలలకు దూరం చేస్తున్న ప్రభుత్వ వైఖరి వల్ల ప్రభుత్వ పాఠశాలలపై సమాజానికి విశ్వాసం పోతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యారంగంపై ప్రభుత్వం అవలంబిస్తున్న అసంబద్ధ నిర్ణయాలను వెనక్కి తీసుకొని, విద్యారంగా సమస్యల పరిష్కారంపై విద్యాశాఖను సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి సరి అయిన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో 190 జీవోను అమలు చేస్తూ ఇతర జిల్లాలకు 317 జీవోను బాధితులకు ఉపశమనం కలిగించాలని ప్రభుత్వాన్ని కోరారు. వీటితోపాటు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సుదీర్ఘకాలంగా ఎస్జీటీలుగా పనిచేస్తున్న బీఈడీ అర్హత కలిగిన టీచర్లకు ఎల్ ఎఫ్ ఎల్ మరియు స్కూల్ అసిస్టెంట్ లు గా వెంటనే పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా టి పి టి ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు దుమాల రమానాద్ రెడ్డి, విక్కుర్తి అంజయ్యలు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఆరు డిఏ ల ను వెంటనే విడుదల చేయాలని అన్నారు.హెల్త్ కార్డుల అమలులో జరుగుతున్న నిర్లక్ష్యంతో పాటు తీవ్ర జాప్యాన్ని నివారించాలని, ఉద్యోగులకు నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందించడంపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని ఈ హెచ్ ఎస్ పరిధిలోకి వస్తున్న ప్రైవేటు కార్పొరేటు ఆసుపత్రుల బకాయిలను చెల్లించి పకడ్బందీగా ఎంప్లాయిస్ హెల్త్ స్కీము అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి, మైలారం తిరుపతి, కృష్ణ చైతన్య, రామచంద్రం, పలు మండలాల బాధ్యులు , సంజీవ్, కుమార్ ,తిరుపతి, ఉపేందర్, వెంకట హనుమాన్, శ్రీధర్, కృష్ణ, తిరుపతి, వేణు, రాజేందర్, బూర భాస్కర్, చకినాల భాస్కర్ , వేణు, బాలాగౌడ్ , తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ముగిసిన మూడు రోజుల వరుణయాగ మహోత్సవాలు

బలగం టీవీ, వేములవాడ :



రాజన్న సిరిసిల్ల జిల్లా దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడలోని శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో లోకకళ్యాణార్థం, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని సంకల్పిస్తూ నిర్వహించిన మూడు రోజుల వరుణయాగ మహోత్సవాలు శనివారం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి.ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నిర్ణయం మేరకు, దేవాదాయ శాఖ అధికారుల ఆదేశాలనుసారం రాష్ట్రంలో నెలకొన్న అనావృష్టి పరిస్థితులు తొలగి, ప్రజలు సుఖశాంతులతో, పంటలు సమృద్ధిగా పండేలా, సకాలంలో వర్షాలు కురవాలని సంకల్పించి ఈ మహాయాగాన్ని జూలై 30 నుండి ఆగస్టు 1 వరకు మూడు రోజుల పాటు నిర్వహించారు.మహోత్సవాల్లో భాగంగా ఋష్యశృంగ మహర్షి ప్రతిష్ఠ, దేవతా పూజలు, గౌరీ పూజ, విశ్వశాంతి కార్యక్రమాలు, వాస్తు హోమం, నవగ్రహ హోమం, పరివార దేవతా హోమం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, ఇంద్రాది దేవతల జపాలు, హవనాలు, శ్రీ భీమేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం తదితర వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.అదేవిధంగా ప్రధాన దేవత శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఏకాంతంగా నిర్వహించారు. అనంతరం వరుణ పర్జన్య దీపారాధనతో పాటు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.మహోత్సవాల చివరి రోజు శనివారం ఉదయం మూలమంత్ర హోమం, ఇతర వైదిక క్రతువులు నిర్వహించి ఉదయం 10.30 గంటల నుండి 11.00 గంటల మధ్య పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం 108 కలశాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి స్వామివారికి మహామంగళహారతి సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి మాట్లాడుతూ, భగవంతుని అనుగ్రహంతో రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, వ్యవసాయం సమృద్ధిగా సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ జయకుమారి,పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఆలయ అర్చకులు, వేదపండితులు, ఆలయ అధికారులు, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో జావెలిన్ త్రో విజేతగా బానోత్ నరేష్..



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

రాజన్న సిరిసిల్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2026లో బీజేఆర్ వ్యవసాయ కళాశాల, సిరిసిల్లకు చెందిన విద్యార్థి బానోత్ నరేష్ జావెలిన్ త్రో పోటీలో ప్రథమ స్థానం సాధించి ప్రతిభ చాటారు. బి ఎస్‌సి (ఆనర్స్) అగ్రికల్చర్ చివరి సంవత్సరం చదువుతున్న నరేష్ ఈ విజయంతో ఆగస్టు 7న హనుమకొండలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ మెరిట్ సర్టిఫికేట్ అందజేసింది. బీజేఆర్ వ్యవసాయ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది బానోత్ నరేష్‌ను అభినందిస్తూ, రాష్ట్ర స్థాయిలోనూ విజయాన్ని సాధించి కళాశాల, జిల్లా, విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలు వదులుకోండి!

**తాత్కాలిక విజయాల కోసం షార్ట్‌కట్స్ వెతకవద్దు..**

**2020-21 నాటి పటిష్టమైన టీమ్‌ను పునర్నిర్మించడంపైనే బీసీసీఐ దృష్టి పెట్టాలి!**

**భారత జట్టుకు మాజీ క్రికెటర్ దీప్ దాస్‌గుప్తా సంచలన హితవు**

బలగం టీవీ, న్యూఢిల్లీ

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్త్‌పై భారత క్రికెట్ జట్టు ఆశలు వదులుకోవడం మంచిదని మాజీ క్రికెటర్, ప్రముఖ విశ్లేషకుడు దీప్ దాస్‌గుప్తా సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఫైనల్ చేరడం కంటే, జట్టు ప్రదర్శనను మెరుగుపర్చుకోవడంపైనే యాజమాన్యం దృష్టి పెట్టాలని ఆయన హితవు పలికారు. ప్రస్తుతం భారత టెస్ట్ జట్టు తీవ్రమైన పరివర్తన దశ (Transition Phase)లో ఉందని, ఇలాంటి సమయంలో జట్టు పురోగతి స్థిరంగా ఉండటమే అత్యంత కీలకమని స్పష్టం చేశారు.

గతేడాది సౌతాఫ్రికా పర్యటనలో ఎదురైన క్లీన్ స్వీప్ పరాభవంతో భారత్ ఫైనల్ అవకాశాలు తీవ్రంగా సంక్లిష్టంగా మారాయి. రాబోయే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించాలంటే భారత్ తదుపరి ఆడబోయే 9 టెస్టుల్లో కనీసం 7 మ్యాచ్‌ల్లో విజయం సాధించాల్సి ఉంది. అయితే, రాబోయే సిరీస్‌ల సవాళ్లను బట్టి చూస్తే ఇది అంత సులువు కాదని దాస్‌గుప్తా అభిప్రాయపడ్డారు. శ్రీలంకతో జరగబోయే టెస్ట్ సిరీస్ నేపథ్యంలో ఆయన తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా భారత జట్టు ప్రస్తుత స్థితిగతులపై సుదీర్ఘంగా మాట్లాడారు.

దీప్ దాస్‌గుప్తా మాటల్లో.. "నేను చెప్పే ఈ చేదు నిజం చాలా మంది అభిమానులకు నచ్చకపోవచ్చు. కానీ ప్రస్తుతానికి మనం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌ను మరిచిపోవడం జట్టు భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుంది. ఇప్పుడు దాని గురించి మాట్లాడటం కూడా అనవసరం. మన ప్రధాన లక్ష్యం 2020-21 కాలంలో ప్రపంచాన్ని గడగడలాడించినంత బలంగా భారత టెస్ట్ టీమ్‌ను మళ్లీ పునర్నిర్మించడంపైనే ఉండాలి."

అనుభవజ్ఞులైన ఆటగాళ్లు లేకపోవడం ప్రస్తుత జట్టులో ప్రధాన లోపంగా కనిపిస్తోందని ఆయన విశ్లేషించారు. ఒకవేళ జట్టు కేవలం డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడమే లక్ష్యంగా పెట్టుకుంటే, మ్యాచ్‌లు గెలవడం కోసం తాత్కాలిక మార్గాలను (Shortcuts) వెతికే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆయా సిరీస్‌లను గెలవడానికి చూసే తాత్కాలిక వ్యూహాల వల్ల దీర్ఘకాలిక ప్రయోజనాలు దెబ్బతింటాయని, భవిష్యత్తు ఎడిషన్లలోనైనా భారత్ మళ్లీ ఆధిపత్యం చెలాయించాలంటే ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో బలమైన పునాది వేయాలని సూచించారు.

ఫైనల్ చేరాలంటే సమీకరణాలివే..

దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి తర్వాత మారిన సమీకరణాల ప్రకారం భారత్ ముంగిట కఠిన సవాల్ ఉంది:

మొత్తం మిగిలి ఉన్న టెస్టులు: 9

ఫైనల్ చేరడానికి కచ్చితంగా గెలవాల్సినవి: 7

రాబోయే విదేశీ పర్యటనలు: శ్రీలంక (2 టెస్టులు), న్యూజిలాండ్ (2 టెస్టులు)

సొంతగడ్డపై సిరీస్: ఆస్ట్రేలియాతో ప్రతిష్టాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ (5 టెస్టులు)

శ్రీలంకతో టెస్ట్ సిరీస్.. సరాన్ష్ జైన్‌కు చాన్స్!

శ్రీలంకతో త్వరలో ప్రారంభం కానున్న టెస్ట్ సిరీస్ కోసం భారత తుది జట్టుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సిరీస్ కోసం జట్టులో కీలక మార్పులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్న యువ స్పిన్నర్ సరాన్ష్ జైన్ జట్టులోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉండగా, గతంలో మ్యాచ్ విన్నర్‌గా పేరు తెచ్చుకున్న ఒక సీనియర్ ఆటగాడిపై వేటు పడే సూచనలు కనిపిస్తున్నాయి. లంక పిచ్‌లు స్పిన్‌కు అనుకూలించనుండటంతో భారత సెలెక్టర్లు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

# 'నా ఆట కంటే అటిట్యూడ్ నచ్చకనే జట్టు నుంచి తప్పించేవారు!'

**హార్దిక్ పాండ్యా సంచలన వ్యాఖ్యలు**

**నాయకుడిగా ఉండటానికి కెప్టెన్ కావాల్సిన అవసరం లేదు.. ఇంటర్వ్యూలో మనసు విప్పిన స్టార్ ఆల్‌రౌండర్**

**ప్రస్తుతం ఎన్‌సీఏలో రిహాబిలిటేషన్.. త్వరలోనే వైట్ బాల్ సిరీస్‌లతో పునరాగమనం!**

బలగం టీవీ, న్యూఢిల్లీ




టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న ఒడిదొడుకులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కెరీర్ తొలినాళ్లలో తాను పరుగులు చేయనందుకు కాదు, కేవలం తన అటిట్యూడ్ (ప్రవర్తన/శైలి) నచ్చకనే జట్టు నుంచి తప్పించేవారని ఆయన వెల్లడించారు. తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో హార్దిక్ తన వ్యక్తిగత ప్రయాణం, కెప్టెన్సీ వివాదాలు మరియు విమర్శకులపై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

సాధారణ సాంప్రదాయ క్రికెటర్లలా కాకుండా తాను కాస్త భిన్నంగా ఉండటం, రంగురంగుల వస్తువుల పట్ల ఇష్టం, చురుకుగా ఉంటూ హాస్యభరితంగా మాట్లాడటం వంటివి కెరీర్ ప్రారంభంలో తనకు మైనస్‌గా మారాయని ఆయన పేర్కొన్నారు. "అప్పట్లో నా అటిట్యూడ్ వల్లే చాలా అవకాశాలు కోల్పోయాను. కానీ నిజం చెప్పాలంటే, అప్పట్లో అసలు అటిట్యూడ్ అంటే ఏంటో కూడా నాకు తెలిసేది కాదు, దానిపై ఎలాంటి అవగాహన ఉండేది కాదు" అని హార్దిక్ చెప్పుకొచ్చారు.

కెప్టెన్సీ కోసం నేనెప్పుడూ ఆడలేదు..

సారథ్య బాధ్యతలపై స్పందిస్తూ.. తాను ఎప్పుడూ పదవుల కోసమో, జట్టులో తన మాట నెగ్గించుకోవడానికో క్రికెట్ ఆడలేదని హార్దిక్ స్పష్టం చేశారు. "నాయకుడిగా నిలబడటానికి జట్టుకు కెప్టెన్ కావాల్సిన అవసరం లేదు. ఒక సాధారణ ఆటగాడిగా ఉంటూ కూడా జట్టును నడిపించవచ్చు. నేను కెప్టెన్ కాకపోయినా జట్టులో ఎప్పుడూ ఒక లీడర్‌లాగే భావిస్తాను. మైదానంలో నా పాత్ర ఏంటో నాకు తెలుసు, నేను చెప్పే మాటలను జట్టులోని 11 మంది ఆటగాళ్లు వింటారు" అని తనపై తనకు ఉన్న నమ్మకాన్ని వ్యక్తపరిచారు. దేశానికి ప్రాతినిధ్యం వహించడమే ప్రతి క్రికెటర్ కల అని, కెప్టెన్సీ అనేది అదనపు గౌరవం మాత్రమేనని, ఆ సంతోషం తనకు కొద్ది నిమిషాలు మాత్రమే ఉంటుందని, ఆ తర్వాత జట్టును ఎలా మెరుగుపరచాలనే దానిపైనే దృష్టి పెడతానని తెలిపారు.

విమర్శకులపై తాను ఎలాంటి ప్రతీకారాలు తీర్చుకోనని హార్దిక్ స్పష్టం చేశారు. అంతా సవ్యంగా సాగినప్పుడు విమర్శలపై పగ తీర్చుకున్నానని ప్రజలు అనుకోవచ్చని, కానీ తనకు అలాంటి ఉద్దేశాలు లేవని, తనకు తాను సంతృప్తి చెందడమే ఏకైక లక్ష్యమని చెప్పారు. క్రికెట్ నుంచి చిన్న విరామం తీసుకోవడానికి గల కారణాన్ని వివరిస్తూ.. మనస్సును ఉత్తేజపరుచుకొని, ఆ పాత ఉత్సాహంతో ఆటను మనస్ఫూర్తిగా ఆస్వాదించడానికే ఈ బ్రేక్ తీసుకున్నట్లు వెల్లడించారు.

ఫిట్‌నెస్‌పై ఫోకస్.. త్వరలోనే మైదానంలోకి!

గాయం కారణంగా కొంతకాలంగా భారత జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా.. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్స్ (గతంలో NCA)లో ఉంటూ రిహాబిలిటేషన్ తీసుకుంటున్నారు. తన ఫిట్‌నెస్‌ను పూర్తిగా మెరుగుపరుచుకునే పనిలో ఉన్న ఆయన, టీమిండియా తదుపరి ఆడబోయే వైట్ బాల్ (పరిమిత ఓవర్ల) సిరీస్‌ల ద్వారా మళ్లీ మైదానంలోకి దిగేందుకు ముమ్మరంగా సిద్ధమవుతున్నారు.

ఐపీఎల్ వర్గాల్లో హార్దిక్ పాండ్యా ట్రేడింగ్‌కు సంబంధించి ఒక ఆసక్తికరమైన ట్విస్ట్ నెట్టింట హల్‌చల్ చేస్తోంది. ముంబై ఇండియన్స్ జట్టులో ఉన్న హార్దిక్ పాండ్యాను తమ వైపు తిప్పుకునేందుకు ప్రతిష్టాత్మక చెన్నై సూపర్ కింగ్స్ (CSK) కళ్లు చెదిరే ఆఫర్‌ను ముంబై ముందు ఉంచినట్లు క్రీడా వర్గాల్లో గట్టి ప్రచారం సాగుతోంది. దీనికి తోడు ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ ఐపీఎల్ 2027 సీజన్ కోసం ఒక యువ ఓపెనర్‌పై కన్నేసినట్లు సమాచారం.

## వైభవ్‌కు వైస్ కెప్టెన్సీపై జాఫర్ అభ్యంతరం

**అభిమన్యు ఈశ్వరన్‌కు బాధ్యతలు అప్పగిస్తే బాగుండేదన్న మాజీ ఓపెనర్**

బలగం టీవీ, న్యూఢిల్లీ

దులీప్ ట్రోఫీ కోసం ఎంపికైన తూర్పు మండల జట్టులో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి ఉప కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడంపై భారత మాజీ క్రికెటర్ వసీం జాఫర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అతని స్థానంలో అనుభవజ్ఞుడైన అభిమన్యు ఈశ్వరన్‌కు ఆ బాధ్యతలు అప్పగించి ఉంటే సముచితంగా ఉండేదని అభిప్రాయపడ్డారు.

తూర్పు మండల జట్టుకు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా ఎంపిక కాగా, కేవలం 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని ఉప కెప్టెన్‌గా నియమించడం చర్చనీయాంశమైంది. ఈ విషయంపై తన అభిప్రాయాన్ని వెల్లడించిన జాఫర్.. యువ ఆటగాడిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని అన్నారు. అయితే ప్రథమ శ్రేణి క్రికెట్‌లో వైభవ్ గణాంకాలు ఇంకా అంత గొప్పగా లేవని, అందువల్ల ఈ నిర్ణయంపై చర్చ జరగడం సహజమేనన్నారు. దేశవాళీ క్రికెట్‌లో సుదీర్ఘ అనుభవం ఉన్న అభిమన్యు ఈశ్వరన్ బెంగాల్ జట్టుకు నాయకత్వం వహించారని, ప్రథమ శ్రేణి క్రికెట్‌లో ఎనిమిది వేలకుపైగా పరుగులు సాధించిన ఆటగాడికి ఉప కెప్టెన్సీ ఇస్తే మరింత సముచితంగా ఉండేదని పేర్కొన్నారు.

అయితే ఈ అంశాన్ని అతిగా వివాదాస్పదం చేయాల్సిన అవసరం లేదని జాఫర్ స్పష్టం చేశారు. వైభవ్ సూర్యవంశీ ప్రతిభావంతుడని, భవిష్యత్తులో భారత జట్టుకు నాయకత్వం వహించే స్థాయికి ఎదిగే సామర్థ్యం అతనికి ఉందని చెప్పారు. ప్రస్తుతం అప్పగించిన ఉప కెప్టెన్సీ బాధ్యతలు అతనికి మరింత ప్రేరణగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. కాగా, దులీప్ ట్రోఫీలో తూర్పు మండల జట్టు ఆగస్టు 23న బెంగళూరులో ఉత్తర మండల జట్టుతో తొలి మ్యాచ్ ఆడనుంది. యువ ఆటగాడిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే ఈ బాధ్యతలు అప్పగించినట్లు ఎంపిక కమిటీ వెల్లడించింది.

# గ్లాస్గోలో భారత సివంగుల 'గోల్డెన్' పంచ్!

**కామన్వెల్త్ క్రీడల్లో బాక్సర్ల స్వర్ణాల వేట..**

**ఒకే రోజు నలుగురు మహిళా బాక్సర్లకు పసిడి పతకాలు!**

**భారత్ ఖాతాలో 10 స్వర్ణాలు.. 33 పతకాలతో జోరు**

బలగం టీవీ, న్యూఢిల్లీ




కామన్వెల్త్ క్రీడల్లో భారత మహిళా బాక్సర్లు సరికొత్త చరిత్ర సృష్టించారు. రింగులో సివంగిలా చెలరేగుతూ ప్రత్యర్థులపై పంచ్‌ల వర్షం కురిపించి వరస స్వర్ణ పతకాలతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. మెగా టోర్నీ పదో రోజు భారత బాక్సింగ్ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా నిలిచింది. ప్రీతి పవార్ పసిడి పతకంతో మొదలైన భారత జైత్రయాత్ర.. ఆ తర్వాత ముగ్గురు బాక్సర్లు అదే బాటలో నడవడంతో ఒకే రోజు ఏకంగా నాలుగు స్వర్ణ పతకాలు భారత ఖాతాలో చేరాయి. వీరి అద్భుత ప్రదర్శనతో టోర్నీలో భారత్ గెలిచిన మొత్తం స్వర్ణాల సంఖ్య 10కి చేరింది. ప్రీతి, జాస్మినేల జోరు..మహిళల 54 కిలోల విభాగంలో బరిలోకి దిగిన ప్రీతి పవార్ పసిడి పతకంతో భారత స్వర్ణాల వేటకు శుభారంభం పలికింది. ఆమె అందించిన స్ఫూర్తితో 57 కిలోల విభాగంలో రింగులోకి దిగిన జాస్మినే లంబోరియా సైతం ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వకుండా రెచ్చిపోయింది. ఉత్తర ఐర్లాండ్‌కు చెందిన మైఖేల్ వాల్ష్‌ను 5-0తో పూర్తిగా చిత్తు చేసి గోల్డ్ మెడల్‌ను ముద్దాడింది. బాక్సింగ్ రింగులో భారత నారీమణుల గర్జన.. ఏకపక్ష పోరాటాలతో ప్రత్యర్థులు క్లీన్ స్వీప్!సాక్షి, ప్రియా సైతం..జాస్మినే తెచ్చిన ఊపుతో 51 కిలోల ఫైనల్లో బరిలోకి దిగిన సాక్షి చౌదరి 'గోల్డెన్ పంచ్' విసిరింది. ఇంగ్లండ్ ఛాంపియన్ రూబీని 5-0తో ఏకపక్షంగా ఓడించి దేశానికి తొమ్మిదో పసిడిని బహుమతిగా ఇచ్చింది. ఆ వెంటనే 60 కిలోల విభాగంలో ప్రియా ఘంఘాస్ సైతం కెనడా బాక్సర్ మ్యారీ బతౌల్‌ను మట్టికరిపించింది. మూడో రౌండ్ ముగిసేసరికి 4-1తో స్పష్టమైన ఆధిక్యం సాధించి భారత్ ఖాతాలో 10వ స్వర్ణాన్ని జమ చేసింది. [బాక్స్ ఐటమ్ 1] పతకాల పట్టికలో భారత్ స్థానంగ్లాస్గో వేదికగా జరుగుతున్న ఈ క్రీడల్లో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నారు.మొత్తం సాధించిన పతకాలు: 33 స్వర్ణ పతకాలు (గోల్డ్): 10 [బాక్స్ ఐటమ్ 2] జుడోలో ఉన్నాటికి కాంస్యంఒకవైపు బాక్సర్లు స్వర్ణాలతో మెరవగా, మరోవైపు జుడోలో భారత్‌కు కాంస్య పతకం దక్కింది. మహిళల జుడో విభాగంలో పతకంపై ఆశలు రేపిన భారత జుడోకా ఉన్నాటి శర్మ గట్టి పోటీ ఇచ్చి చివరకు కాంస్య పతకంతో సరిపెట్టుకుంది

# పారా షాట్‌పుట్‌లో భారత్‌కు 'బంగారు' పంట!




**ఒకే ఈవెంట్‌లో స్వర్ణం, రజతం కొల్లగొట్టిన సోనమ్ రానా, శుభమ్ జుయల్**

**గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో పతకాల వేటలో దూసుకెళ్తున్న భారత అథ్లెట్లు**

బలగం టీవీ, న్యూఢిల్లీ

కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెట్ల పతకాల వేట అప్రతిహతంగా కొనసాగుతోంది. శనివారం జరిగిన పారా షాట్‌పుట్ ఈవెంట్‌లో భారత పారా అథ్లెట్లు సరికొత్త చరిత్ర సృష్టించారు. పురుషుల ఎఫ్ 57 ఫైనల్ పోటీల్లో భారత ఆటగాళ్లు సోనమ్ రానా, శుభమ్ జుయల్‌లు తొలి రెండు స్థానాల్లో నిలిచి దేశానికి వరుసగా పసిడి, రజత పతకాలను అందించి డబుల్ ధమాకా చాటారు.

తీవ్ర ఉత్కంఠభరితంగా సాగిన ఈ ఫైనల్ పోరులో సోనమ్ రానా ఇనుపగుండును ఏకంగా 13.40 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అదే ఉత్సాహంతో రింగులోకి దూకిన మరో భారత అథ్లెట్ శుభమ్ జుయల్ సైతం అద్భుత ప్రదర్శన చేశాడు. ఇనుపగుండును 13.28 మీటర్ల దూరం విసిరి సోనమ్‌కు గట్టి పోటీ ఇస్తూ రెండో స్థానాన్ని దక్కించుకొని, సిల్వర్ మెడల్‌ను సొంతం చేసుకున్నాడు.

ఒకే వేదికపై మువ్వన్నెల జెండాల రెపరెపలు.. సరికొత్త రికార్డులతో భారత్ పతకాల పంట!

పదో రోజు పతకాల వర్షం..

గ్లాస్గో ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో పదో రోజు భారత అథ్లెట్లు పతకాల పంట పండిస్తున్నారు. బాక్సర్లు ప్రీతి పవార్, జాస్మినెలు పసిడి పతకాలతో ఈ విజయ పరంపరను ప్రారంభించగా, వారి నుంచి లభించిన స్ఫూర్తితో మిగతా అథ్లెట్లు సైతం దేశ కీర్తి పతాకాన్ని ఎగురవేశారు.

[బాక్స్ ఐటమ్ 1] ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో చారిత్రక విజయాలు

ట్రిపుల్ జంప్: భారత జంపర్లు ప్రవీణ్ చిత్రవేల్ రజత పతకం, సెల్వ ప్రభు తిరుమరన్ కాంస్య పతకాలతో సత్తా చాటారు.

డెకథ్లాన్: ఈ విభాగంలో తేజస్విన్ శంకర్ అద్భుత ప్రదర్శనతో దేశానికి మొట్టమొదటి చారిత్రక పతకాన్ని అందించి సరికొత్త రికార్డు సృష్టించాడు.

బాక్సింగ్: పురుషుల 55 కిలోల విభాగంలో భారత బాక్సర్ జై డిక్సన్ రజత పతకంతో సరిపెట్టుకున్నాడు




# జావెలిన్ త్రోలో సరికొత్త 'భారత స్టార్'..

**యశ్వీర్ సింగ్ సంచలన కాంస్యం!**

**హేమాహేమీలను అధిగమించి కాంస్య పతకం కైవసం చేసుకున్న 24 ఏళ్ల యువ వీరుడు రజతంతో సరిపెట్టుకున్న 'గోల్డెన్ బాయ్' నీరజ్ చోప్రా.. ఆఖరి త్రోలో నీరజ్ ఇచ్చిన మద్దతుతో అదరగొట్టిన యశ్వీర్**

బలగం టీవీ, న్యూఢిల్లీ




భారత జావెలిన్ త్రో క్రీడలో మరో నయా స్టార్ పుట్టుకొచ్చాడు. గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో 24 ఏళ్ల యువ బల్లెం వీరుడు యశ్వీర్ సింగ్ సంచలన ప్రదర్శనతో కాంస్య పతకాన్ని ముద్దాడాడు. ప్రపంచ స్థాయి దిగ్గజాలైన అండర్సన్ పీటర్స్, అర్షద్ నదీమ్, కేషోర్న్ వాల్కట్ వంటి హేమాహేమీలను వెనక్కి నెట్టి మరీ యశ్వీర్ ఈ ఘనత సాధించడం విశేషం. ఈ మెగా ఈవెంట్‌లో భారత 'గోల్డెన్ భాయ్' నీరజ్ చోప్రా సిల్వర్ మెడల్ (రజతం) సాధించగా, యశ్వీర్ కాంస్యంతో మెరిశాడు. ప్రస్తుతం యావత్ దేశం నీరజ్ కంటే ఎక్కువగా ఈ యువ సంచలనం గురించే చర్చించుకుంటోంది.

ఆఖరి త్రోలో హై డ్రామా.. నీరజ్ ఇచ్చిన కొండంత అండ!

యశ్వీర్ సింగ్ కాంస్య పతక విజయం వెనుక తీవ్ర ఉత్కంఠభరితమైన డ్రామా నడిచింది. ఈ పోటీల్లో తన తొలి ప్రయత్నాన్ని, అలాగే నాలుగో ప్రయత్నాన్ని యశ్వీర్ ఫౌల్ చేశాడు. అప్పటికి కేవలం 81.33 మీటర్ల త్రోతో రేసులో ఉన్నప్పటికీ, పతకం సాధించడానికి అది సరిపోలేదు. ఇక చివరిదైన ఆరో త్రో వేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో.. అక్కడ ఉన్న స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా ఇచ్చిన మద్దతు యశ్వీర్‌లో కొండంత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. నీరజ్ సూచనతో తన రన్నప్‌ను మార్చుకున్న యశ్వీర్ సింగ్.. ఆఖరి ప్రయత్నంలో ఈటెను ఏకంగా 85.41 మీటర్ల దూరం విసిరి తన కెరీర్ బెస్ట్ ప్రదర్శనతో మూడో స్థానాన్ని (కాంస్యాన్ని) ఖరారు చేసుకున్నాడు.

వెదురుబొంగు కర్రలతో సాధన మొదలుపెట్టి.. నేడు కామన్వెల్త్ పోడియంపై మువ్వన్నెల జెండాను ఎగరేసిన రాజస్థాన్ కుర్రాడు!

ఎవరీ యశ్వీర్ సింగ్..?

రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన యశ్వీర్ సింగ్ చిన్నతనంలో ఫిట్‌నెస్ కోసం బాస్కెట్‌బాల్ ఆడేవాడు. అయితే తండ్రి ప్రోత్సాహంతో జావెలిన్ త్రో వైపు మళ్లాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆరంభంలో ఎలాంటి ప్రొఫెషనల్ సామాగ్రి లేకుండా కేవలం వెదురుబొంగు కర్రలతోనే సుదీర్ఘ కాలం సాధన చేశాడు. యశ్వీర్ తండ్రి రాయ్ సింగ్ కూడా జాతీయ స్థాయి జావెలిన్ అథ్లెట్ కావడం విశేషం. ఆయన మార్గదర్శకత్వంలోనే యశ్వీర్ ఈ క్రీడలో మెలకువలు నేర్చుకున్నాడు. "నేను అథ్లెట్‌గా ఉన్నప్పుడు చేసిన పొరపాట్లను నా కుమారుడు చేయకుండా జాగ్రత్తపడ్డాను. మా కఠిన శ్రమకు తగిన ఫలితం దక్కింది" అని రాయ్ సింగ్ ఆనందం వ్యక్తం చేశారు.

[బాక్స్ ఐటమ్ 1] యశ్వీర్ సింగ్ కెరీర్ మైలురాళ్లు..

అండర్-20 ఫెడరేషన్ కప్: ఈ టోర్నీలో స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా పేరిట ఉన్న పాత రికార్డును బద్దలు కొట్టి యశ్వీర్ మొదటిసారి దేశవ్యాప్తంగా వెలుగులోకి వచ్చాడు.

2022 సీజన్: తొలిసారి 80 మీటర్ల మార్కును దాటి అంతర్జాతీయ ప్రమాణాల వైపు అడుగులేశాడు.



025 ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్: ఈ పోటీల్లో ఈటెను 82.57 మీటర్ల దూరం విసిరి ఐదో స్థానంలో నిలిచాడు.

2026 కామన్వెల్త్ గేమ్స్: కెరీర్ బెస్ట్ త్రో (85.41 మీటర్లు) నమోదు చేసి కాంస్య పతకంతో సంచలనం సృష్టించాడు.

లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌పై కన్ను!

ఈ కామన్వెల్త్ పతకంతో యశ్వీర్ సింగ్ ఒక్కసారిగా 'టాక్ ఆఫ్ ది నేషన్'గా మారిపోయాడు. గ్లాస్గోలో భారత్‌కు సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ అందించిన నీరజ్ చోప్రా, యశ్వీర్ సింగ్ ద్వయంపై ఇప్పుడు అంచనాలు భారీగా పెరిగాయి. రాబోయే ప్రతిష్టాత్మక లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ క్రీడల్లో ఈ ఇద్దరు భారత వీరులు దేశానికి పతకాలు అందిస్తారని యావత్ భారతావళి ఆశలు పెట్టుకుంది.

**నీరజ్‌కు రజతం.. యశ్వీర్‌కు కాంస్యం!**

గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ జావెలిన్ త్రో ఈవెంట్‌లో స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగిన టూటైమ్ ఒలింపిక్ విజేత, 'గోల్డెన్ భాయ్' నీరజ్ చోప్రా ఈసారి రజత పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. శనివారం తెల్లవారుజామున ఉత్కంఠభరితంగా జరిగిన పురుషుల జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్ చోప్రా ఈటెను 85.83 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు. నీరజ్ ప్రదర్శన అభిమానులను కొంత నిరాశకు గురిచేసినప్పటికీ.. ఇదే ఈవెంట్‌లో భారత్‌కు చెందిన మరో యువ అథ్లెట్ యశ్వీర్ సింగ్ కాంస్య పతకంతో సంచలనం సృష్టించడంతో భారత శిబిరంలో పండుగ వాతావరణం నెలకొంది.

శ్రీలంక అథ్లెట్‌కు స్వర్ణం.. నదీమ్ కు తీవ్ర నిరాశ!

ఈ పోటీల్లో శ్రీలంకకు చెందిన రమేశ్ పతిరగే ఊహించని రీతిలో చెలరేగి 89.75 మీటర్ల అద్భుతమైన త్రోతో స్వర్ణ పతకాన్ని ఎగరేసుకుపోయాడు. కాగా, పారిస్ ఒలింపిక్ విజేత, పాకిస్థాన్‌కు చెందిన స్టార్ అథ్లెట్ అర్షద్ నదీమ్ కేవలం 77.41 మీటర్ల దూరం మాత్రమే విసిరి 9వ స్థానంతో తీవ్రంగా నిరాశపరిచాడు. గ్రెనేడియన్ స్టార్ అండర్సన్ పీటర్స్ (83.88 మీటర్లు), సౌతాఫ్రికాకు చెందిన డౌ స్మిత్ (82.88 మీటర్లు) వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. ఫైనల్లో పోటీపడ్డ మరో భారత అథ్లెట్ రోహిత్ యాదవ్ ఈటెను 81.56 మీటర్ల దూరం విసిరి ఏడో స్థానాన్ని దక్కించుకున్నాడు.

నీరజ్ ఇచ్చిన 'బంగారు' సలహా.. రేసులోకి యశ్వీర్!

ఈ ఫైనల్ మ్యాచ్‌లో నీరజ్ చోప్రా తన రెండో ప్రయత్నంలో అత్యుత్తమంగా 85.83 మీటర్ల దూరం నమోదు చేసి రజతాన్ని ఖరారు చేసుకున్నాడు. అయితే, యువ అథ్లెట్ యశ్వీర్ సింగ్ తొలి నాలుగు ప్రయత్నాల్లో 81.33 మీటర్ల మార్కును దాటలేక పతక రేసులో వెనుకబడ్డాడు. ఈ తరుణంలో పెద్దన్నలా అండగా నిలిచిన నీరజ్ చోప్రా.. రనప్ మార్చుకోవాలని యశ్వీర్‌కు విలువైన సూచన చేశాడు. నీరజ్ ఇచ్చిన ఆ సలహాతో ఆఖరి ప్రయత్నంలో రనప్ మార్చుకుని బరిలోకి దిగిన యశ్వీర్, ఈటెను ఏకంగా 85.41 మీటర్ల దూరం విసిరి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

కామన్వెల్త్ క్రీడల్లో నీరజ్ చోప్రాకు ఇది రెండో పతకం. గతంలో 2018 గోల్డ్ కోస్ట్ క్రీడల్లో ఆయన స్వర్ణం సాధించగా, 2022 బర్మింగ్‌హామ్ క్రీడలకు గాయం కారణంగా దూరమయ్యాడు.

# 3న అగాధ ట్రైలర్ విడుదలకు సన్నాహాలు

సీనియర్ దర్శకుడు, నిర్మాత ఎంఎస్ రాజు మరోసారి దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'అగాధ'. మిస్టికల్ డివైన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో నటిస్తుండగా, ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఆగస్టు 3 మధ్యాహ్నం 12 గంటలకు 'అగాధ' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఈ ట్రైలర్ ద్వారా సినిమా కథ, ఆధ్యాత్మిక నేపథ్యం, మిస్టరీ ఎలిమెంట్స్‌పై మరింత స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. విడుదలకు ముందే ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచేలా ట్రైలర్ ఉండబోతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, అజయ్ కెఆర్ సమర్పిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను ఎంఎస్ రాజు స్వయంగా నిర్వహించడం విశేషం. తన కెరీర్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలు అందించిన ఆయన, ఈసారి విభిన్నమైన ఆధ్యాత్మిక థ్రిల్లర్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్లతో పాటు శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్, సిజ్జు, రోషన్, శ్రేయా రాణి రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రతి పాత్రకూ కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని చిత్రబృందం చెబుతోంది. భారీ స్థాయిలో రూపొందిన 'అగాధ' చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుండటంతో ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో తీసుకురాబోతున్నారు. ఇప్పటికే ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసిన చిత్రబృందం, ట్రైలర్ విడుదల అనంతరం మరింత దూకుడుగా ప్రమోషన్స్ నిర్వహించనుంది. మిస్టరీ, ఆధ్యాత్మికత, థ్రిల్లింగ్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కిన ఈ చిత్రం ఎంఎస్ రాజుకు దర్శకుడిగా మరో విజయాన్ని అందిస్తుందా అనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది.




## CINEMA



# దీపావళి బరిలో సూర్య 47 మూవీ

కథానాయకుడు సూర్య ఇటీవలే 'కరుప్పు' సినిమా విజయంతో తదుపరి చిత్రాల విషయంలో జోరు పెంచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చే నెల ఆయన... మమితా బైజు ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాతో ప్రేక్షకుల్ని మరోసారి పలకరించనున్నారు. అయితే తాజాగా సూర్య, కథానాయిక నజ్రియా జంటగా రూపొందుతున్న 'సూర్య 47' చిత్రం కూడా విడుదల తేదీని ఖరారు చేసుకున్నట్లు తెలిసింది. 'ఆవేశం' ఫేమ్ జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని చిత్రబృందం దీపావళికి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తుందట. దీపావళికి విడుదల ఖరారైతే ఈ ఏడాది సూర్య ఖాతాలో మూడు చిత్రాలు చేరనున్నాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో నస్లేన్ కీలకపాత్ర పోషిస్తున్నాడు.

# వారణాసి వాయిదా ప్రచారాలకు చెక్

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా మెగా ప్రాజెక్ట్ వారణాసిపై గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వినిపిస్తున్న వాయిదా ప్రచారాలకు ఫుల్ స్టాప్ పడింది. ఈ సినిమా ప్రకటించిన తేదీకే విడుదల కానుందని చిత్ర యూనిట్‌కు చెందిన విశ్వసనీయ వర్గాలు స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో అభిమానుల్లో నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'వారణాసి' ఒకటి. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా జోనాస్ హీరోయిన్‌గా నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ ముగ్గురు స్టార్‌ల కలయికతో పాటు రాజమౌళి దర్శకత్వం కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశం ఉందంటూ సోషల్ మీడియాలో పలు కథనాలు వైరల్ అయ్యాయి. భారీ విజువల్ ఎఫెక్ట్స్, విస్తృత స్థాయిలో జరుగుతున్న నిర్మాణ పనుల కారణంగా విడుదల తేదీ మారొచ్చని ప్రచారం జరిగింది. అయితే చిత్ర యూనిట్ వర్గాల సమాచారం ప్రకారం అలాంటి పరిస్థితి ఏదీ లేదని, సినిమా ముందుగా ప్రకటించినట్లుగానే 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని తెలుస్తోంది. ప్రస్తుతం సినిమా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రణాళిక ప్రకారమే కొనసాగుతున్నాయని సమాచారం. ఇప్పటికే కీలక షెడ్యూళ్లు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చిత్రబృందం పని చేస్తోందని తెలుస్తోంది. 'వారణాసి' విడుదలకు ఇంకా 250 రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో అభిమాను ల్లో ఉత్సాహం మరింత పెరిగింది. రాజమౌళి ప్రతి సినిమాను అంతర్జాతీయ స్థాయిలో రూపొందించే తీరు, మహేష్ బాబు తొలిసారి ఆయన దర్శకత్వంలో నటిస్తుండటం, ప్రియాంక చోప్రా రీఎంట్రీ వంటి అంశాలు ఈ చిత్రాన్ని మరింత ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. భారీ బ్జడెట్‌తో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రూపొందుతున్న ఈ చిత్రం భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టుకు తీసుకెళ్తుందనే అంచనాలు ఉన్నాయి. విడుదల తేదీపై స్పష్టత రావడంతో ఇకపై చిత్రబృందం నుంచి టీజర్, పోస్టర్లు, ఇతర ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన వరుస అప్‌డేట్లు వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.




# రామాయణ మూవీలో డ్రెస్సింగ్‌పై సోషల్ మీడియాలో రచ్చ

బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం' ట్రైలర్ విడుదలైనప్పటి నుంచీ పలు అంశాలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. తాజాగా ఈ చిత్రంలో రాణి కైకేయి పాత్రలో నటిస్తున్న ప్రముఖ నటి లారా దత్తా తొలి లుక్‌పై నెటిజన్లు రకరకాల కామెంట్లు చేస్తున్నారు. త్రేతాయుగంలో సాగిన పురాణ గాథ ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో, లారా దత్తా ధరించిన మోడ్రన్ డిజైనర్ బ్లౌజ్, స్టైలిష్ హెయిర్‌స్టైల్ పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. త్రేతాయుగ కాలానికి తగినట్లుగా కాకుండా, ప్రస్తుత కాలానికి తగ్గట్టుగా నీట్‌గా కుట్టిన డిజైనర్ బ్లౌజ్, హెయిర్, సెలూన్ స్టైల్ హెయిర్‌స్టైల్‌తో లారా కనిపించడంపై విమర్శలు వస్తున్నాయి. త్రేతా యుగంలో ప్లెయిన్ రా సిల్క్ చీరలు, హెవీ స్టోన్ ఎంబ్రాయిడరీ, కాంట్రాస్ట్ బ్లౌజ్‌లు ఎవరూ డిజైన్ చేసేవారు? అంటూ కొందరూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇక లారా దత్తా లుక్ చూస్తుంటే రామాయణంలా కాకుండా, ఏవో ఏక్తా కపూర్ టీవీ సీరియల్ షూటింగ్‌లో పాల్గొన్నట్లుగా ఉందని మరికొందరు కామెంట్ చేశారు. ఇక సినిమా మేకర్స్ తీసుకున్న ఈ సృజనాత్మక స్వేచ్ఛ, కాస్ట్యూమ్ డిజైన్ పై వస్తున్న విమర్శలపై చిత్ర యూనిట్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి! మహర్షి వాల్మీకి రామాయణం, తులసీదాస్ రామచరితమానస్ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా, నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. ఈ భారీ బడ్జెట్ చిత్రంలో రణబీర్ కపూర్, యశ్, సాయి పల్లవి, రవి దూబే, అరుణ్ గోవిల్, వివేక్ ఒబెరాయ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా 2026 దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.






# తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే నటనలో అడుగుపెట్టా

అందాల తార ప్రీతి ముకుందన్ అంతరంగం

తాను నటనని కెరీర్‌గా ఎంచుకోవడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని అందాల తార ప్రీతి ముకుందన్ అభిప్రాయపడింది. ఇటీవల 'బ్లాస్ట్', 'హృదయం మురళీ'లాంటి చిత్రాలలో వైవిధ్యమైన పాత్రల్లో కనిపించి ఆకట్టుకుంది ప్రీతి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన మొదటి ఆడిషన్‌కు సంబంధించిన ఓ ఆసక్తికర సంగతిని పంచుకుంది. మా ఫ్యామిలీలో అందరం చదువుపైనే ఎక్కువ దృష్టి పెట్టే వాళ్లం. మా వాళ్లు చదువులో నన్ను ఎంతగా ప్రోత్సహించేవా రో.. నేను నా మనసుకు నచ్చినట్టు కూడా నడుచుకోవా లని అంతే పట్టుదలతో ఉండేవారు. అందుకే కెరీర్ ప్రారంభంలో కొంత కాలం మోడలింగ్ చేశాను. 18 ఏళ్ల వయసులోనే నాకు ఓ చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. అప్పుడు నటనపై నాకంత నమ్మకం లేక ఆడిషన్ ఇవ్వలేనని చెప్పేశా. కానీ మా అమ్మానాన్న 'నువ్వు ఇది ఎందుకు ప్రయత్నించకూడదని ఆడిషన్‌కు వెళ్లమని ప్రోత్సహించారు. దాంతో ఆడిషన్‌లో నా వంతు నేను ప్రయత్నించాను కానీ, ఆ పాత్ర దక్కలేదు. కానీ నా తల్లిదండ్రులు నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన క్షణమది. చిత్రపరిశ్రమ ఓ కొత్త ప్రపంచం. మా వాళ్లకి దాని గురించి ఏ మాత్రం తెలియదు కానీ, మనసుకి నచ్చింది చేయమని చెప్ప డంతోనే నా ప్రయాణం మొదలైంది. ఆ తర్వాతే నెమ్మదిగా నటన పట్ల అభిరుచి పెరిగి, సినిమాని ప్రేమిం చడం మొదలు పెట్టానని అంది.



